


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 24.10.2025 | సంపుటి : 2 | సంచిక :259 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Friday | 24.10.2025 | volume : 2 | Issue : 259 | Pages : 8 | Cost : 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..


సెల్ : 9182 474 575




04

### మళ్లీ 2,600 పెరిగిన బంగారం ధర

హైదరాబాద్: అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో నిన్న దిద్దుబాటుకు గురైన బంగారం, వెండి ధరలు గురువారం మళ్లీ పెరిగాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల పసిడి ధర క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.2,600 పైనే పెరిగింది. నేటి మార్కెట్లో 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల ధర రూ.1,28,300కు చేరింది. ఇక, 22 క్యారెట్ల ధర రూ.1,14,650గా ఉంది.



06

### ట్రంప్ కొత్త వ్యూహం

అతిపెద్ద రష్యా చమురు సంస్థలపై అమెరికా ఆంక్షలు



06

### స్నేహం అంటే అత్యాచారానికి లైసెన్స్ కాదు..

దిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు



06

### నవంబర్ 1 నుంచి బ్యాంకు ఖాతాకు నలుగురు నామినీలు

# ఇద్దరికి మించి పిల్లలున్నా ఎన్నికల్లో పోటీ!

## 'ఇద్దరు పిల్లల నిబంధన' ఎత్తివేత

## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం

### గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆర్డినెన్స్ బిల్లు

తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉన్న 'ఇద్దరు పిల్లల నిబంధన' ఎత్తివేతకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 21(3) తొలగించాలని కేబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 21(3)ని సవరించే ఆర్డినెన్స్‌పై ఆ శాఖ మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతకం చేశారు.

హైదరాబాద్, అక్టోబర్ 23 : కేబినెట్ ఆమోదం పొందిన నేపథ్యంలో ఆర్డినెన్స్ బిల్లు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దగ్గరకు వెళ్లనుంది. గవర్నర్ ఈ బిల్లును ఆమోదిస్తే వచ్చే గ్రామీణ స్థానిక ఎన్నికల్లో ఇద్దరికి మించి పిల్లలు ఉన్నవారు కూడా పోటీ చేసేందుకు వీలు కలుగు తుంది. కాగా, 1994లో అప్పటి ప్రభుత్వం కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించడానికి ఇద్దరు పిల్లల నిబంధనను అమల్లోకి తెచ్చింది. 1994 తర్వాత మూడో సంతానం కలిగిన వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో

- మిగతా 2 లో..



# రౌడీ షీటర్‌కు కాంగ్రెస్ టికెట్

## ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యం

- కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రతి ఇంటికి పంచాలి
- పభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- పార్టీ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్, అక్టోబర్ 23 : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యంగా భారత రాష్ట్ర సమితి నాయకులకు పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో దాదాపు రెండున్నర గంటలకుపైగా పార్టీ సీనియర్ నేతలతో కేసీఆర్ సమావేశమ య్యారు. ఉప ఎన్నిక ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. "కాంగ్రెస్ బాకీ కార్డులను జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి పంచాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తెలంగాణ ఆగమైంది.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఆగమవుతున్న

- మిగతా 2 లో..






## పదో తరగతి పరీక్ష ఫీజు షెడ్యూల్

హైదరాబాద్: తెలంగాణలో పదో తరగతి ఫైనల్ పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలను డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రకటించింది. అక్టోబరు 30వ తేదీ నుంచి నవంబర్ 13 లోపు పాఠశాల హెడ్‌మాస్టర్లకు విద్యార్థులు ఫీజు చెల్లించాలని తెలిపింది. హెచ్‌ఎంలు

- మిగతా 2 లో..

# మీ అవినీతికి తల వంచకపోతే అధికారులను బలి చేస్తారా?

## కేంద్రమంత్రి బండి సంజయ్

మీ అవినీతికి తల వంచకపోతే అధికారులను బలి చేస్తారా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర హెూంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనా వ్యవస్థ, అవినీతి రాజకీయాలకు ఐపీఎస్ అధికారి రిజ్వీ వీఆర్‌ఎస్ నిదర్శనమని ఎక్స్‌లో పోస్టు చేశారు. నిజాయితీగల, సమర్థుడైన అధికారి వీఆర్‌ఎస్ తీసుకునే పరిస్థితికి ఎందుకొచ్చిందన్నారు.



హైదరాబాద్: దీనిపై తెలంగాణ ప్రజలకు తెలుసుకునే హక్కు ఉందన్నారు. మీ వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికారులను వేధిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లలో మంత్రులు జోక్యం చేసుకుంటున్నారని

- మిగతా 2 లో..

# వెలుగుల మాటున చీకటి

## వేడుకల్లో పేలుడు వల్ల 125మంది కంటికి గాయాలు



న్యూఢిల్లీ, అక్టోబర్23 : జీవితాల్లో వెలుగులు నింపే దీపావళి పండుగ మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ నగరంలోని కొన్ని కుటుంబాల్లో చీకటిని నింపింది. నేటి రోజుల్లో దీపావళి రోజు బాణాసంచా కాల్చడం పతాక స్థాయికి చేరింది. కొత్త కొత్త బాణాసంచా వీధుల్లో అందుబాటులోకి రావడంతో పిల్లలతో సహా పెద్దలు కూడా వాటిని కొనుగోలు చేసి కాల్చుతున్నారు. తాజాగా

- మిగతా 2 లో..

# గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తెలంగాణ

## తెలంగాణ ఐటి శాఖమంత్రి శ్రీధర్‌బాబు



తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఐటి శాఖమంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా లైఫ్ సైన్సెస్ అత్యున్నత నిర్ణాయక సంస్థ 'ఆస్ బయోటెక్' నిర్వహించిన సదస్సులో శ్రీధర్‌బాబు కీలకోపన్యాసం చేశారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ సాధించిన పురోగతి, భవిష్యత్ ప్రణాళిక, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించారు.

02

# మూడ్రోజుల్లో వర్షాలు

## హెచ్చరించిన వాతావరణశాఖ

హైదరాబాద్, అక్టోబర్ 23 : తెలంగాణలో రాగల మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాబోయే 12గంటల్లో ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలను ఆనుకొని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది. ఆ తర్వాత 12గంటల్లో ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల



- మిగతా 2 లో..



# పజలు కోరుకుంటే రాజకీయ పార్టీగా తెలంగాణ జాగృతి

## ప్రజల సమస్యలపై గళమెత్తుతూనే ఉంటా

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

యాదగిరిగుట్ట, అక్టోబర్ 23 : రాష్ట్రంలో 19 ఏళ్ల క్రితం ఎన్జీవోగా పుట్టిన తెలంగాణ జాగృతి సంస్థ ప్రజలు కోరుకుంటే రాజకీయ పార్టీగా మారొచ్చని ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వ కుంట్ల కవిత అన్నారు. తెలంగాణ జాగృతి కార్యకర్తలతో కలిసి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీన రసింహస్వామి దర్శించుకుని

- మిగతా 2 లో..

# ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

(మొదటి పేజీ తరువాయి)

పోటీకి అనర్హులుగా మారారు. 1994లో అప్పటి ప్రభుత్వం కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించడంలో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనను అమల్లోకి తెచ్చింది. ఈ చట్టం ప్రకారం 1994 తర్వాత మూడో సంతానం కలిగితే వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులు. ఏపీ నుంచి తెలంగాణ విడిపోయాక 2018లో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందిం చిన కేసీఆర్ ప్రభుత్వం.. ఇద్దరు పిల్లల నిబంధనను టచ్ చేయలేదు. పంచాయతీరాజ్ చట్టం 2018 సెక్షన్ 21(3) ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలున్న వారు అనర్హులు. అయితే.. ప్రస్తుతం కుటుంబ నియంత్రణపై అవగాహన పెరిగినందున పాత నిబంధనను మార్చి ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వారికి సైతం పోటీ చేసే అవకాశం ఇవ్వాలని పలు రాజకీయ పార్టీలు కోరాయి. 2024 డిసెంబర్ 20న జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ఈ ప్రతిపాదన రాగా మంత్రి వర్గం ఆమోదించలేదు. తాజాగా ఇవాళ జరిగిన కేబినెట్..పంచాయతీ ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేతకు ఆమోదం తెలిపింది.



# ప్రజల సమస్యలపై గళమెత్తుతూనే ఉంటా

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైకుంఠ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ జాగృతి సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్ గా ఉన్నా ప్రజల సమస్యలపై గళ మెత్తిందన్నారు. ఇకపైనా అదే వైఖరిని కంటిన్యూ చేస్తామని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజల తరపున మాట్లాడామని, ఏం చేస్తే ప్రజలకు మంచి జరుగుతుందో తెలంగాణ జాగృతి తన గళాన్ని విని పించిందని అన్నారు. ప్రజల తరపున పోరాడాలంటే రాజకీయ పార్టే కానవసరం లేదన్న ఆమె.. కానీ ప్రజలు కోరుకుంటే మాత్రం తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా మారవచ్చని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలో అనేక ప్రాంతీయ పార్టీలు ఉన్నాయన్నారు. తెలంగాణ జాగృతి కూడా రాజకీయపార్టీగా మారడం కూడా పెద్ద విషయం కాద న్నారు. కానీ సమయం, సందర్భంగా వచ్చినప్పుడు జాగృతి సంస్థ కూడా రాజకీయ పార్టీగా ఆవిర్భవించవచ్చని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల వల్ల ప్రజలకు మంచి జరగాలనేది తమ సంకల్పమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడం కోసమే ఈ నెల 25న నిజామాబాద్ లో తెలంగాణ జాగృతి జనం బాట యాత్రను ప్రారంభించి నాలుగు నెలల పాటు నిర్విరామంగా కొనసాగించనున్నట్లు వెల్లడించారు. అందరి సలహాలు, సూచనలతో యాత్రను నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

# దీపావళి వారి కుటుంబాల్లో వెలుగులు తీసేసింది

(మొదటి పేజీ తరువాయి)

బాణాసంచా కాలుస్తుండగా అనుకోని ఘటన జరిగింది. తుపాకీ ఆకారంలోనే ఉండే బాణాసంచాను పిల్లలు పేలుస్తుండగా.. అందులోని విషపు రసాయనాలు పిల్లల కంటిపై పడి తీవ్ర ప్రభావం చూపింది. గన్ కాల్చేటప్పుడు.. గొట్టంలో పెట్టి గురి చూసి కాల్చుతారు. అలాగే చిన్నపిల్లలు కూడా కాల్చుతుండగా రసాయనాలు పేలి కళ్లపై పడ్డాయి . కేవలం రూ. 150-200 ఖర్చుతో తయారయ్యే కాల్షియం కార్బైడ్ తుపాకీ, పిల్లల జీవితాల్లో అంధకారం సృష్టించింది. కళ్ళకు గాయాలు కావడంతో పిల్లలందరిని ఆసుపత్రులకు తరలించారు. అయితే కొందరు పెద్దలు కూడా ఈ తుపాకిని పేల్చి తమ ప్రాణాల మీదికి తెచ్చుకున్నారు. ఆసుపత్రులు తెలిపిన వివరాల ప్రకారం ఇప్పటివరకు 125 మందికి పైగా ఈ పేలుడు బారిన పడ్డారు. ఈ గ్యాస్ లైటర్, ప్లాస్టిక్ పైపు, సులభంగా దొరికే కాల్షియం కార్బైడ్‌తో ఈ బొమ్మ తుపాకిని తయారు చేస్తారు. పైపులో ఉన్న కార్బైడ్ నీటితో కలిసినప్పుడు ఆసిటైలిన్ వాయువు ఉత్పత్తి అవుతుంది. ఆ సమయంలో చిన్న చిమ్మటి చిమ్మరుతో భారీ పేలుడు సంభవిస్తుంది. పైపు పగిలిపోతే ప్లాస్టిక్ ముక్కలు కళ్లలోకి, ముఖంపైకి దూసుకెళ్లి తీవ్రమైన గాయాలు కలిగిస్తాయి. చాలా సార్లు పిల్లలు ఆసక్తిగా పైపులోకి చూడగానే పేలుడు జరిగి కళ్లకు, ముఖానికి, కార్నియాకు గాయాలయ్యాయి. భోపాల్ ఆసుపత్రుల నివేదికల ప్రకారం, వందకు పైగా బాధితుల్లో 20-30 శాతం మందికి తీవ్రమైన డ్యామేజ్ అయిందని పేర్కొంది. కొందరికి వెంటనే శస్త్రచికిత్స చేయాల్సి వచ్చిందని.. కొంతమందికి కార్నియా ట్రాన్స్‌ప్లాంట్ చేయాల్సి వచ్చిందని వైద్యులు తెలిపారు.

# వచ్చే మూడ్రోజుల్లో భారీ వర్షాలు

మొదటి పేజీ తరువాయి

మీదుగా కదిలే అవకాశం ఉందని చెప్పింది. గురువారం ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నా గర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయని తెలిపింది. శుక్రవారం ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పే ర్కొంది. కొత్తగూడెం, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే సూచనలున్నాయని తెలిపింది. శనివారం వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు.. భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నా రాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు కురిసే ఛాన్స్ ఉందని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణను కాపాడుకోవాల్సిన అవసరముంది. ప్రజల్లో కాంగ్రెస్ వైఫల్యాలపై విస్తృతంగా చర్చ జరగాలి" అని కేసీఆర్ అన్నారు. సమావేశంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, జూబ్లీహిల్స్ అభ్యర్థి సునీత, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, సీనియర్ నేతలు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక లో రౌడీ షీటర్‌కు కాంగ్రెస్ టికెట్ ఇచ్చిందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి హయాంలో తెలంగాణ గుల్ల అయిందని ఆక్షేపించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై పార్టీ శ్రేణులకు గులాబీ బాస్ దిశానిర్దేశం చేశారు. రెండు గంటలకి పైగా ఈ సమావేశం కొనసాగింది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహంపై మార్గనిర్దేశం చేశారు కేసీఆర్. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో డివిజన్ల వారీగా ఇప్పటివరకూ జరిగిన ప్రచార సరళిని అడిగి తెలుసుకున్నారు కేసీఆర్. మాగంటి గోపీనాథ్ చనిపోయారని.. ఈ క్రమంలో ఉపఎన్నిక అనివార్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బాధను దిగమింగుకుని ధైర్యంగా ఎన్నికలను ఎదుర్కోవాలని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, పార్టీ కేడర్‌కి సూచించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వ్యతిరేకతను ఉపయోగించుకుని ముందుకెళ్లాలని నేతలకు సూచించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ప్రజల్లో వ్యతిరేకత ఉందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నేతలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఉప ఎన్నికలో బీఆర్ఎస్ భారీ మెజారిటీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు కేసీఆర్.కాంగ్రెస్ ఇచ్చిన హామీల బాకీ కార్డులను జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రతి



ఇంటికీ పంచాలని ఆజ్ఞాపించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక తెలంగాణ ఆగమైందని విమర్శించారు. ఆగమవుతున్న తెలంగాణని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేసీఆర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో పేదలను వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజల్లో విస్తృతంగా కాంగ్రెస్ వైఫల్యాలపై చర్చ జరగాలని ఆదేశించారు కేసీఆర్.జూబ్లీహిల్స్ బైపోల్స్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయమైందని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లో మెజారిటీపై ఫోకస్ పెట్టాలని బీఆర్ఎస్ నేతలకు కేసీఆర్ సూచించారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలను కాపాడుకోవ డానికి జూబ్లీహిల్స్ ప్రజలు బీఆర్ఎస్‌ని గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణలో ఆర్థిక వ్యవస్థ దిగజారిందని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో అమలైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మాయమయ్యాయని విమర్శించారు. కాంగ్రెస్ దుష్టపాలనపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని బీఆర్ఎస్ నేతలకి సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం ప్రభావం.. జీహెచ్ఎంసీ ఎన్నికలపైనా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలిస్తే.. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు తమ వైపే ఉంటారని కేసీఆర్ జోస్యం చెప్పారు.

# కొత్త వ్యవసాయ విధానం రూపొందించాలి

## తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనంలో ప్రొ.కోదండరాం

**హైదరాబాద్:** చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త వ్యవసాయ విధానాన్ని రూపొందించాలని ప్రొ.కోదండరాం సూచించారు. రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో గురువారం జరిగిన తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. వ్యవసాయ కూలీల పిల్లలకు వర్సిటీలో ప్రత్యేకంగా సీట్లు ఇవ్వడం గొప్ప నిర్ణయమని విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి పేర్కొన్నారు. వర్సిటీ శాస్త్రవేత్తలు, విద్యార్థులు వ్యవసాయరంగానికి చేదోడువాదోడుగా ఉండాలని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న సూచించారు. ఈ సందర్భంగా ఉపకులపతిగా ఏడాది పూర్తి చేసుకున్న అల్దాస్ జానయ్యని వారు అభినందించారు. వర్సిటీ ఏడాది ప్రగతి నివేదికను విడుదల చేశారు. తెలంగాణ ఉ



ద్యమంలో చురుకుగా పాల్గొన్న వారిని సత్కరించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితిలకు బుద్ధిచెప్పాలి: కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ :** ఎంఐఎం కనుసన్నల్లో నడుస్తున్న కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితిలకు జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ భాజపా అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి మద్దతుగా గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడు తూ.. ఎంఐఎంకు చెందిన వ్యక్తి గోరక్షకుడిపై కాల్పులు జరపడం రాష్ట్రంలోని శాంతిభద్రతల వైఫల్యానికి అద్దంపడుతోంద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భారత రాష్ట్ర సమితి బాటలోనే ఎంఐఎంను పెంచి పోషిస్తోం దని ఆరోపించారు. గోవుల అక్రమ రవాణాను చట్టానికి లోబడి అడ్డుకుంటున్న గోరక్షకుడిపై కాల్పులకు పాల్పడ్డా రంటే రాష్ట్రంలో మజ్లిస్ దౌర్జన్యాలు, గూండాయిజం ఏ రకంగా పెరిగిందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎంఐఎం నాయకుల వద్ద అక్రమంగా ఆయుధాలున్నాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

# 95 వేలు దాటిన 'మద్యం' దరఖాస్తులు

**హైదరాబాద్:** మద్యం దుకాణాల కోసం 95 వేలకుపైగా దరఖాస్తులు దాఖలయ్యాయి. చివరిరోజైన గురువారం రాత్రి 11 గంటల వరకు 95,285 దరఖాస్తులు వచ్చిన ట్లు ఆబ్కారీశాఖ వర్గాలు వెల్లడించాయి. ఇంకా లెక్కింపు కొనసాగుతోందని తెలిపాయి.

# మున్సిపాలిటీలకు రూ.41 కోట్ల విడుదల

**హైదరాబాద్:** రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, నగరపాలికలకు వడ్డీలేని రుణాల పథకం కింద ప్రభుత్వం రూ.41.20 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు పురపాలకశాఖ కార్యదర్శి డాక్టర్ టీకే శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు.

# 'ఎక్సైజ్ శాఖలో పరిణామాలపై విచారణ జరపాలి'

**హైదరాబాద్:** ఎక్సైజ్ శాఖలో తాజాగా నెలకొన్న పరిణామాలపై విచారణ జరపాలని సీపీఎం డిమాండ్ చేసింది. ముఖ్యకార్యదర్శి రిజ్వీ వీఆర్ఎస్ తీసుకోవడా నికి గల కారణాలేమిటో బహిర్గతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. శాఖలో అక్రమాల ను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గురువారం ఓ ప్రకటనలో ఆయన కోరారు.

# రెండు రైలు మార్గాల్లో విద్యుత్ ట్రాక్షన్ అభివృద్ధి

**హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని మేడ్చల్-ముద్కేడ్, మహబూబ్‌నగర్-డోన్ సెక్షన్లలో విద్యుత్ ట్రాక్షన్ల వ్యవస్థ అభివృద్ధికి రైల్వేబోర్డు ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఆ మార్గాల్లో ఒకే 25 కేవీ ఎలక్ట్రిక్ ట్రాక్షన్ వ్యవస్థ ఉంది. దానిని రెండు 25 కేవీ ఎలక్ట్రిక్ ట్రాక్షన్లకు మార్చనున్నారు. మేడ్చల్-ముద్కేడ్ సెక్షన్‌ను రూ.193.26 కోట్లతో, మహబూబ్‌నగర్-డోన్ సెక్షన్‌ను రూ.122.81 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నా రు. మెరుగుపరిచే ఎలక్ట్రిక్ ట్రాక్షన్‌తో అధిక ఓల్టేజీ విద్యుత్ సరఫరా అవుతుంది. ఫలితంగా రైళ్లు ఎక్కువవే గంతో ప్రయాణించేందుకు ఈవ్యవస్థ దోహదం చేస్తుంది.



# కాంగ్రెస్ హయాంలోనే యువతకు ఉద్యోగాలు

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్:** నీళ్లు, నిధులు, నియామకాల ప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలోనే యువతకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా లభిస్తున్నాయని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల గ్రూప్-2 ద్వారా ఎంపికైన 14 మంది నూతన సబ్ రిజిస్ట్రార్లు గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలిశారు. వారిని అభినందించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ... "గత దశాబ్ద కాలంలో నిరుద్యోగ యువత కలలు కల్లలై పోయాయి. ఉద్యోగాల నియామక ప్రక్రియలో గత ప్రభుత్వం చూపించిన అలసత్వం, నిర్లక్ష్యంతో అక్రమాలు, పేపర్ లీకేజీలు యువత ఆశలను అడుగంటేలా చేశాయి. ఈ పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్... సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఉద్యోగాల భర్తీకి అత్యంత ప్రాధాన్యమిస్తోంది. 20 నెలల కాలంలో 70 వేలకు పైగా పోస్టులు భర్తీ చేసింది. రెవెన్యూ శాఖలో జీపీవోలు, గృహనిర్మాణ శాఖలో ఒప్పంద పద్ధతిలో 350 మంది ఇంజినీర్లు, సర్వే విభాగంలో 3,465 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఉపాధి అవకాశాలు లభించాయి" అని పేర్కొన్నారు. కొత్తగా ఉద్యోగాల్లో చేరిన సబ్ రిజిస్ట్రార్లు నిజాయతీతో పనిచేయాలన్నారు. మంత్రి వెంట రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ సంతోష్‌రెడ్డి ఉన్నారు.

# కేటీఆర్‌ది దిగజారుడు రాజకీయం : మంత్రి జూపల్లి



**హైదరాబాద్:** ఐఏఎస్ అధికారి రిజ్వీ వీఆర్ఎస్ ఉదంతంపై కేటీఆర్ దిగజారుడు రాజకీయం చేస్తున్నారని ఆబ్కారీశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. ప్రభుత్వ విధులకు భంగం కలుగుతోందని చర్యలకు పూనుకుంటే... దానికి మసిపూసి మారేడుకాయ చేసి జూబ్లీహిల్స్, స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. తనపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై పరువునష్టం దావా వేస్తానని చెప్పారు. గురువారం మంత్రిమండలి సమావేశం అనంతరం ఆయన సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. "రిజ్వీ ఉదంతంపై కేటీఆర్, ఇతరులు రాజకీయ పబ్బం కోసం ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారు. మద్యం సీసాలను ట్రాకింగ్ చేయడం, నకిలీ మద్యం విక్రయాలను అడ్డుకునేందుకు, పన్నుల రాబడిని పెంచేందుకు హోలోగ్రామ్ లేబుల్స్ దోహదం చేస్తాయి. 2013 ఆగస్టు 21న హోలోగ్రామ్ టెండర్ల ఒప్పందం కుదిరింది. 2014 జులై 1 నుంచి అమలులోకి వచ్చింది. 2019 జూన్ 30న ముగిసింది. 2019 జులై 1 నుంచి నూతన ఒప్పందం అమలులోకి రావాల్సి ఉంది. అయినా పాత దాన్నే కొనసాగించారు. 2022 అక్టోబరు 15న ఇచ్చిన జీవో ప్రకారం కొత్తగా హోలోగ్రామ్ టెండర్లు ఖరారు చేయాలని గతేడాది ఆగస్టు 13న ఎక్సైజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీని ఆదేశించాను. గతేడాది సెప్టెంబరు 24న టెండర్ల ఖరారుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారు. అదే నెల 27న ఆ కమిటీని రద్దు చేశారు. ఎలాంటి మార్పులు చేర్పులు లేకుండానే తిరిగి అక్టోబరు 17న నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి 23 కంపెనీలు హోలోగ్రామ్ లేబుళ్లు సరఫరా చేసేందుకు టెండర్లు వేశాయి. ఆయనపై చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు ఈ నెల 11న ఫిర్యాదు చేశాను. తప్పు చేసిన అధికారిపై ఫిర్యాదు చేయడం తప్పు కాదు.

# మీ అవినీతికి తల వంచకపోతే అధికారులను బలి చేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. అవినీతి బయటపడితే రాజీ పడని అధికారులపైనే నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. గతంలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం కూడా ఇదే విధంగా వ్యవహరించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కేసీఆర్ అధికారులను బలి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్ములా ఈ-రేసు కేసులో తన తప్పులను దాచుకునేందుకు కేటీఆర్ అధికారులపై నిందలు మోపారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ సైతం భారత రాష్ట్ర సమితి దారిలోనే నడుస్తోందని దుయ్యబట్టారు.

# తెలంగాణలో పదో తరగతి పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

మొదటి పేజీ తరువాయి

ఆన్‌లైన్ ద్వారా నవంబర్ 14 లోపు ఫీజు చెల్లింపు చేయాలని, విద్యార్థుల డేటాను నవంబర్ 18 లోపు డీఈవోలకు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రూ.50 ఆలస్య రుసుముతో నవంబర్ 29 వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబరు 2 నుంచి 11వ తేదీవరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబరు 15 నుంచి 29 వరకు పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించారు.

# గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

జీఎస్‌డీపీ ఎక్కువ. ఏడాదిన్నరలో రూ.3.2లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం. లైఫ్ సైన్సెస్ రంగాన్ని రాబోయే ఐదేళ్లలో 250 మిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యం. దీనికి సంబంధించి త్వరలో నూతన పాలసీ తీసుకు రాబోతున్నాం. గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్‌లో భారత్ నుంచి హైదరాబాద్‌కు మాత్రమే స్థానం దక్కింది. బయో డిజిటల్ యుగానికి కావాల్సిన అత్యుత్తమ వనరులు అందించేలా యువతను తీర్చిదిద్దుతున్నాం" అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.జ

# డిసెంబరు 9న 'టిమ్స్' ప్రారంభం

**హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న టిమ్స్ ఆసుపత్రికి డిసెంబరు 9న ప్రారంభోత్సవం చేయాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ సనత్‌నగర్‌లో నిర్మిస్తున్న టిమ్స్‌తో పాటు గోషామహల్‌లో కొత్తగా నిర్మించనున్న ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ స్థలాలను వైద్యఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, డీఎంఈ నరేంద్రకుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి ఉస్మానియా ఆసుపత్రిపై సమీక్ష నిర్వహించి.. కొత్త భవన నిర్మాణం డిజైన్లకు సంబంధించి పలు మార్పులు చేసిన సందర్భంగా గురువారం వికాస్‌రాజ్ ఉన్నతాధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎట్టిపరిస్థితుల్లో నవంబరు మూడో వారంలో పనులన్నీ పూర్తిచేసి వైద్య ఆరోగ్యశాఖకు టిమ్స్ భవనాన్ని అప్పగించాలని ఆదేశించారు. అంతకుముందు కొత్త ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించే గోషామహల్ మైదానాన్ని అధికారుల బృందం పరిశీలించింది. ముఖ్యంగా ఆసుపత్రి నుంచి శవాగారం ప్రత్యేకంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించిన క్రమంలో పలు డిజైన్లను మార్చిన అధికారులు.. భూగర్భంలో మార్చురీని నిర్మించాలని నిర్ణయించారు.

# 10లోగా పింఛన్ బకాయిలు చెల్లించాలి

**హైదరాబాద్:** తెలంగాణలోని పింఛన్‌దారులందరికీ వచ్చే నెల పదో తేదీలోగా వారికి రావాల్సిన ప్రయోజనాలు (పెన్షన్ బెనిఫిట్స్) చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల ఐకాస డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లో ఐకాస ఛైర్మన్ కె.లక్ష్మయ్య అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ... త్వరలోనే ప్రభుత్వానికి నోటీసు ఇస్తామని చెప్పారు. మరణించిన పెన్షనర్ల వివరాలు అందజేస్తామన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో నవంబరు 17న కుటుంబాలతో కలిసి ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఐకాస నేతలు సత్యనారాయణ, పుల్లయ్య, భరత్‌రెడ్డి, కృష్ణప్రసాద్, జ్ఞానేశ్వర్, జయప్రకాశ్‌రావు, మోహన్‌నారాయణ, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ పాలనలో దర్జాగా సెటిల్‌మెంట్లు

- ఎవరికీ వచ్చినట్టు వారు దోచుకుంటున్నారు
- కాంగ్రెస్ అవినీతిలో అధికారులు భాగస్వామ్యం కావొద్దు
- సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం



**హైదరాబాద్, అక్టోబర్ 23 :** సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో కేవలం సెటిల్‌మెంట్లు తప్ప ఏమీ నడవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఒక మంత్రి ఇంటికి టాస్క్ ఫోర్స్ పోలీసులను ముఖ్యమంత్రి పంపడం, నిందితుని స్వయంగా మంత్రి తన కారులో తీసుకొని మాయమైపోవడం ఎప్పుడూ చూడలేదు. స్వయంగా ముఖ్యమంత్రి అనుచరుడు, అప్పుడు రోహిన్ రెడ్డి బెదిరించారని, తుపాకీ రేవంత్ రెడ్డే ఇచ్చిండని మంత్రి కుమార్తె చెప్పారన్నారు. ముఖ్యమంత్రే తుపాకీ ఇచ్చి పంపించాడని ఆరోపణ చేసినప్పుడు, సీఎం సిగ్గు లేకుండా మౌనంగా ఉన్నాడని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి సిగ్గు ఉంటే కనీసం ఈ అంశంపైన స్పందించాలని డిమాండ్‌చేశారు. రేవంత్ రెడ్డి వంటి బలహీన ముఖ్యమంత్రిని ప్రపంచంలో ఎప్పుడూ చూడలేదని, స్వయంగా నీపైన మంత్రి బిడ్డే ఆరోపణలు చేస్తే ఆ మంత్రినీ పక్కకు జరపలేవు. స్వయంగా నీ మంత్రులు మీపై ఆరోపణలు చేస్తున్నా కనీసం వారిని ముట్టుకోలేని బలహీన ముఖ్యమంత్రివి అని ధ్వజమెత్తారు. తన పరిపాలన పైన, మంత్రుల పైన ఎలాంటి పట్టు లేదని తేలిపోయిందన్నారు. దావూద్ ఇబ్రహీం లాంటి ముఖ్యమంత్రిని తరిమేసుకుంటేనే తెలంగాణకు పట్టిన శనిపోతుందన్నారు. కాంగ్రెస్ అవినీతికి ప్రభుత్వ అధికారులు కూడా భయపడుతున్నారని అన్నారు. వీరి వాటాల పంచాయతీలో మాకు భాగస్వామ్యం వద్దు, మాకు సంబంధం లేదంటూ అధికారులు పారిపోతున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తప్పుడు పనులు చేయమని వేధించడం వల్లనే వారు వాలంటరీ తీసుకుంటున్నారని ఆరోపించారు. మంచి అధికారులు కూడా పారిపోయేలా చేసే దండుపాళ్యం ముఠా రాష్ట్రంలో ఉందని హెచ్చరించారు. తను చెప్పిన పని చేయలేదని చెప్పి సీనియర్ ఐఏఎస్ రిజ్వీ వీఆర్ఎస్ తీసుకుంటే కూడా, ఆయన రాజీనామా ఆమోదించవద్దని జూపల్లి కృష్ణారావు కోరారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలకు, అక్రమాలకు భాగస్వాములు అయితే, అధికారులు వత్తాసు పలికితే గతంలో మాదిరి జైలుకు వెళ్లవలసి వస్తుందని హెచ్చరించారు. గతంలో మాదిరి అధికారులకు శిక్ష కూడా పడుతుందని పేర్కొన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అవినీతి విలయతాండవం చేస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి వేల కోట్లు సంపాదిస్తుంటే, మేము వందల కోట్లయినా సంపాదించవద్దా అని మంత్రులు పోటీ పడుతున్నారన్నారు. గన్నులు పెట్టి బెదిరించడంతో ఇందిరమ్మ రాజ్యంలో వ్యాపారవేత్తలు తమ వ్యాపారాలు చేసుకోలేకపోతున్నారని తెలిపారు. పారిశ్రామికవేత్త నెత్తిన గన్ను పెట్టి బెదిరించారు అని పోలీసులు వెతుకుతున్న నిందితుడిని అరెస్టు చేయొద్దంటూ మంత్రిగారి కుమార్తె ఆపితే.. స్వయంగా మంత్రి తన కారులో తీసుకొని వెళ్ళిపోయినా ఇప్పటిదాకా ఎలాంటి చర్యలు ఎందుకు లేవని నిలదీశారు. రెండు మూడు రోజులపాటు తిట్టుకొని సిగ్గు లేకుండా ముఖ్యమంత్రి, మంత్రి ఇద్దరు కలిసి శాలువాలు కప్పుకుని స్వీట్లు పంచుకున్నారని మండిపడ్డారు. వాటాల పంచాయితీ, అవినీతి సొమ్ముల పంపకాలు, టెండర్ల రిగ్గింగ్ ఇవన్నీ కూడా కాంగ్రెస్ ఇంటి పంచాయతీ లెక్క మారిపోయాయన్నారు. రాష్ట్రంలో మాఫియా రాజ్యమేలుతుంటే, మంత్రులు, ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఇంత రాచకం కొనసాగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారు?. పరిశ్రమల యజమానులకు తుపాకీలు పెట్టినప్పుడు, వాటాల పంచాయతీతోనే మంత్రులు బజారుకెక్కినప్పుడు, సీనియర్ అధికారులు పారిపోతుంటే.. రాష్ట్రంలోని పోలీసు యంత్రాంగం ఏం చేస్తున్నది? అని ప్రశ్నించారు. పోలీసులు మాత్రం గన్ ఇచ్చింది కొండా మురళి, బెదిరించింది కొండా సురేఖ, ఓఎస్‌డీ సుమంత్ అని చెప్తున్నారని, రెండు అంశాల్లో కూడా బెదిరింపులు గన్నుతో జరిగాయనేది వాస్తవం. కానీ ఇప్పటివరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో రాష్ట్ర డీజీపీ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. మా కార్యకర్తలను జైల్లో పెట్టిన పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రయోజనం చేకూర్చేలా పనిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని కొంతమంది పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల కన్నా దారుణంగా పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిజంగా డీజీపీకి నిజాయితీగల పేరు ఉంటే గన్నుల బెదిరింపు వ్యవహారంలో చర్యలు తీసుకుని తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ అంశంలో ఉత్తమ్ కుమార్ రెడ్డిని విచారణ చేసి ఆయన అభిప్రాయాన్ని రికార్డు చేయాలని కోరారు. సుమంత్‌ను విచారించి నిజానిజాలు బయటపెట్టాలన్నారు. ఈ మొత్తం గన్నుతో గురిపెట్టిన సంఘటనలో కచ్చితంగా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి సోదరుడు 15 ఎకరాలు, కొండా సురేఖ 15 ఎకరాలు తీసుకొని మొత్తం 30 ఎకరాల భూమి పంచాయితీ పెట్టుకున్నారు మంచిరేవులలో. ఈ భూమి మొత్తం నాకు కావాలంటే, నాకు కావాలి అని మంత్రి, రేవంత్ రెడ్డి, కొండా సురేఖ కొట్లాడుతున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా మొత్తం బయటపెట్టుకొని తిరిగి రాష్ట్రానికి ఏం సందేశం ఇస్తుంది కాంగ్రెస్ పార్టీ?. గతంలోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కుక్కలు చింపిన విస్తరులా చేస్తారు అని. మంత్రులు కాంట్రాక్టులు, కమిషన్ల వ్యవహారాన్ని ఇంటి పంచాయితీగా మార్చారు. పొంగులేటి నా టెండర్లలో తలదూర్చారని మంత్రి కూతురు స్వయంగా చెప్పింది. బెదిరింపులు, టెండర్ల రిగ్గింగు ఇంత బహిరంగంగా దేశ చరిత్రలో ఏనాడు జరగలేదు. ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఫోన్ చేశాను అనే మంత్రి కూతురు చెప్పినప్పుడు, ఉత్తమ్ కుమార్ రెడ్డిని పిలిచి పోలీసులు విచారించరా?. ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గంలోని దక్కన్ సిమెంట్ కంపెనీ యజమానిపైన గన్ను గురిపెట్టినప్పుడు కనీసం ఉత్తమ్ కుమార్ రెడ్డిని, రోహిన్ రెడ్డిని, సుమంత్‌ను ఎవర్ని కూడా పోలీసులు విచారించలేదు. ఇంత దారుణంగా బహిరంగంగా అవినీతి అంశంపైకి వచ్చినా, బెదిరింపులు బయటపడినా బీజేపీ నేతలు స్పందించడం లేదు. తెలంగాణలో బీజేపీ–కాంగ్రెస్ జాయింట్ వెంచర్ పరిపాలన నడుస్తున్నది. బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు, అమిత్ షా వంటి వాళ్ళు ఎవరు కూడా మాట్లాడడం లేదు. కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు కూడా మౌనంగా ఉన్నాయి. అందుకే తెలంగాణ రాష్ట్రాన్ని బీజేపీ ఏమాత్రం కాపాడలేదని మేము చెప్తున్నాం. కాంగ్రెస్ పరిపాలనలో పరిపాలన లేదు, ప్రజా పాలన లేదు. కేవలం అరాచకాలు, అవినీతి, బెదిరింపులు, కమీషన్లు, టెండర్ల రిగ్గింగ్ అన్నీ నడుస్తున్నాయి.

## పోచారం కాల్పుల కేసును 12 గంటల్లోనే ఛేదించాం

### సీపీ సుధీర్‌బాబు



**హైదరాబాద్, అక్టోబర్ 23 :** పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన కాల్పుల కేసును 12 గంటల్లోనే ఛేదించామని రాచ కొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. యమ్నంపేట్ వద్ద అక్టోబర్ 22న సాయంత్రం కాల్పుల్లో గో రక్షక్ కార్యకర్త బిద్ల ప్రసాంత్ అలియాస్ సోను సింగ్ తీవ్రంగా గాయపడ్డారన్నారు. గో రక్షక్ దళ్ కార్యకర్త ప్రశాంత్‌పై కాల్పులు జరిపి న నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు. ప్రధాన నిందితుడు ఏ1 మొహమ్మద్ ఇబ్రాహీం ఖురేషీని అరెస్టు చేశామని... అలాగే సహ నిందితులు ఏ3 కురువ శ్రీనివాస్, ఏ4 హసన్ బిన్ మోసిన్‌లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మరో నిందితుడు ఏ2 హనీఫ్ ఖురేషీ పరారీలో ఉన్నాడన్నారు. ఇబ్రాహీం.. పశువుల రవాణా వ్యాపారం చేస్తున్నాడని.. గోవుల అక్రమ రవాణా బయటపెట్టాడని ప్రశాంత్‌పై నిందితులు కక్ష పెట్టుకున్నారన్నారు. నిందితుడు ఇబ్రాహీం, బాధితుడు సోను సింగ్‌కు గతంలో పరిచయం ఉందని చెప్పారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. ఇబ్రాహీం 12 సంవత్సరాలుగా పశువుల రవాణా వ్యాపారం చేస్తున్నాడని.. ప్రశాంత్ గతంలో 6 సార్లు పశువుల అక్రమ రవాణా అడ్డుకున్నాడని తెలిపారు. దాంతో ఇబ్రాహీంకు 1 కోటి రూపాయల నష్టం వచ్చిందన్నారు. ఈ క్రమంలో సోనూ సింగ్ అలియాస్ ప్రశాంత్‌పై ఇబ్రాహీం కక్ష పెంచుకున్నాడన్నారు సీపీ. పశువులను రవాణా చేసుకోవాలంటే 5 లక్షలు ఇవ్వాలని ప్రశాంత్ డిమాండ్ చేశాడని నిందితులు చెబుతున్నారని.. దీనిపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని రాచకొండ సీపీ తెలిపారు. నిందితుడు శ్రీనివాస్.. సెటిల్ చేసుకుందాం, మాట్లాడుకుందామని చెప్పి ప్రశాంత్‌ను స్పాట్‌కు రప్పించాడని... మాట్లాడుకుందామని పిలిచి ఫైరింగ్ చేసి పారిపోయారన్నారు. పిస్టల్‌ను ఛత్తీస్‌గఢ్‌లో కొనుగోలు చేసినట్టు తమ దర్యాప్తులో తేలిందన్నారు. నిందితులు వాడిన వెహికల్ సీజ్ చేశామని... ఒక పిస్టల్, మూడు సెల్ ఫోన్స్ సీజ్ చేశామని తెలిపారు. ప్రస్తుతం ప్రశాంత్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఈ ఏడాది రాచకొండ కమిషనరేట్ పరిధిలో 5110 పశువుల్ని ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సంవత్సరం పశువుల అక్రమ రవాణాకు సంబంధించి ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు పేర్కొన్నారు.

## షిర్డీ వెళ్లాలనుకునే వారికి బంపర్ ఆఫర్

**హైదరాబాద్, అక్టోబర్ 23 :** హైదరాబాద్ నుంచి షిర్డీ క్షేత్రానికి రోజూ వేలాది మంది సాయిబాబా భక్తులు వెళ్తుంటారు. సాయిబాబా దర్శనం కోసం వెళ్ళే భక్తులు బస్సులు, రైళ్లు, టూరిజం బస్సులు వంటి వాటిని ఎంచుకుంటారు. అయితే చాలా మందికి షిర్డీ వెళ్లాలని ఉన్నా.. ధర తమకు అందుబాటులో లేదు అంటూ భావిస్తారు.. అటువంటి వారి కోసం తాజాగా బంపర్ ఆఫర్ ప్రకటించింది. తక్కువ ధరకే సాయి సన్నిధి ఎక్స్ హైదరబాద్ అనే పేరుతో ప్రత్యేక షిర్డీ టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెలలో ప్రారంభం కానున్న ఈ టూర్ 2 రాత్రులు, 3 రోజులపాటు సాగనుంది. ప్రతి బుధవారం అందుబాటులో ఉండనున్నది. ఈ టూర్ ప్యాకేజీకి లో టికెట్స్ బుక్ చేసుకోవాలనుకునే వారు సూచించిన వెబ్‌సైట్‌ను సందర్శించాల్సి ఉంటుంది. ఈ నెల అక్టోబర్ 29 తేదిన కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి (రైలు నెంబర్ 17064) సాయంత్రం 6,40 గంటలకు జర్నీ స్టార్ అవుతుంది. సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ వంటి స్టేషన్ల మీదుగా ఈ ప్రయాణం సాగుతుంది. బుధవారం రాత్రి అంతా ప్రయాణం చేసి మహారాష్ట్రలోని నాగర్ సోల్ రైల్వే స్టేషన్ కు చేరుకుంటారు. ఇక్కడ అనుంచి షిర్డీకి ప్రత్యేక వాహనం ద్వారా చేరుకుంటారు. రెండో రేజు ఉదయం శిర్డీలోని హెటల్‌లో చెక్–ఇన్ అవ్వాలి. అల్పాహారం తిని షిర్డీ సాయిబాబా దర్శనం కోసం ఆలయానికి చేరుకోవాలి. సాయంత్రం 5 గంటలకు హెటల్ చెక్ అవుట్ అయ్యి.. రాత్రి 7.30 గంటల నాగర్ సోల్ రైల్వే స్టేషన్ కు చేరుకోవాలి. రెండో రోజు రాత్రంతా ప్రయాణం చేసి మూడో రోజు ఉదయం 9:45కి కాచిగూడకు చేరుకోవాలి.



### తెలంగాణ ప్రభుత్వం

## మరో కీలక నిర్ణయం

### రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా 14 మంది సబ్ రిజిస్ట్రార్ల నియామకం

**హైదరాబాద్, అక్టోబరు 23 :** తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా 14 మంది సబ్ రిజిస్ట్రార్లని రేవంత్‌రెడ్డి సర్కార్ నియమించింది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇందుకు సంబంధించిన విషయాలను మీడియాకు వెల్లడించారు. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా నియమించిన అధికారులు బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలోనే యువతకు ఉద్యోగాలు వచ్చాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉద్ఘాటించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ప్రకటించారు. జీపీవోలు, ఇంజినీర్లు, సర్వేయర్ల నియమకాలతో ఉపాధి అవకాశాలని తమ ప్రభుత్వం విస్తరించిందని తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా 14 మంది సబ్ రిజిస్ట్రార్లని నియమించామని వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వంలో నిరుద్యోగుల కలలు కల్లలు అయిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## హరీశ్‌రావు పిటిషన్‌పై హైకోర్టులో విచారణ



**హైదరాబాద్, అక్టోబరు 23 :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. హైదరాబాద్‌లోని బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టేయాలని హరీశ్ రావు పిటిషన్ వేశారు. కౌంటర్ దాఖలు చేయకపోవడంపై అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి విచారణ వచ్చే వారానికి వాయిదా వేసింది. కాంగ్రెస్ నాయకుడు చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హరీశ్ రావుపై బాచుపల్లి పీఎస్ లో కేసు నమోదు అయింది. హరీశ్ రావుతో ప్రాణహాని ఉందని చక్రధర్ గౌడ్ ఫిర్యాదు చేశారు. కేవలం రాజకీయ కక్ష్యల కారణంగానే పోలీసులు కేసు నమోదు చేశారని విచారణ సందర్భంగా హరీశ్ తరపు న్యాయవాది వాదించారు. చక్రధర్ గౌడ్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పీఎస్‌లో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు కొట్టేసిందని న్యాయస్థానానికి తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

## ముంబైలో అగ్ని ప్రమాదం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 23 :** దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని ఓ వాణిజ్య భవనంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. జోగేశ్వరి వెస్ట్ ఏరియాలోగల జేఎంఎస్ బిజినెస్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దాంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ఫైరింజన్‌ల సాయంతో మంటలను ఆర్పుతున్నారు. భవనంపై అంతస్తులో పలువురు చిక్కుకున్నారు. వారిని కిందకు దించేందుకు రెస్క్యూ టీమ్స్ ప్రయత్నిస్తున్నాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికిగల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.



## హైకోర్టు తీర్పు తర్వాత.. స్థానిక ఎన్నికలపై నిర్ణయం

- మరోమారు కేబినేట్‌లో చర్చిస్తాం
- వివరాలు వెల్లడించిన మంరతి పొంగులేటి

**హైదరాబాద్, అక్టోబర్ 23 :** హైకోర్టు తీర్పు తర్వాత.. స్థానిక ఎన్నికలపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంత్రివర్గ సమావేశం అనంతరం కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. "బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. హైకోర్టులో వచ్చేనెల 3న కేసు విచారణ ఉంది. ఉన్నత న్యాయస్థానం తీర్పు వచ్చిన తర్వాత కేబినెట్‌లో చర్చించి స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటాం అని అన్నారు. వచ్చేనెల 7న మళ్లీ కేబినెట్ సమావేశం ఉంటుంది. రాష్ట్రంలోని నిర్మాణంలో ఉన్న నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నిర్ణయించాం. 1500 మెగావాట్ల బ్యాటరీ విద్యుత్ స్టోరేజ్ ప్లాంట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. రామగుండం థర్మల్ ప్లాంట్‌ను డిస్‌మేంటిల్ చేయాలని నిర్ణయించాం. నల్గొండలోని ఫ్లోరైడ్ బాధితులను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. శ్రీశైలం నుంచి నల్గొండకు గ్రావిటీ ద్వారా నీళ్లు ఇవ్వాలని గతంలో నిర్ణయించాం. నల్గొండకు నీటిని తీసుకొచ్చేందుకు 44 కి.మీ టన్నెల్ నిర్మించాలి. టన్నెల్ బోర్ మిషన్ తో కాకుండా.. కొత్త టెక్నాలజీ ఉపయోగించి టన్నెల్ పూర్తి చేయాలని కేబినెట్‌లో నిర్ణయించాం" అని మంత్రి పొంగులేటి తెలిపారు.



## డీజీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

**హైదరాబాద్, అక్టోబర్ 23 :** గోరక్ష సభ్యుడు సోనూసింగ్‌పై బుధవారం జరిగిన కాల్పులను నిరసిస్తూ బీజేపీ కార్యకర్తలు ఆందోళనకు పిలుపునిచ్చారు. దీంతో డీజీపీ ఆఫీసు వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. జరిగిన సోనూ సింగ్ పై కాల్పులను నిరసిస్తూ ధర్నాకు దిగారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. పలువురిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ లకు తరలిస్తున్నారు. దశలవారీగా వస్తున్న బీజేపీ సభ్యులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. డీజీపీ ఆఫీసులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్‌రావు చేరుకున్నారు. గోరక్షకు కాల్పుల అంశంపై డీజీపీకి మెమొరాండం ఇచ్చారు. అటు కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రవీంద్ర భారతి, అసెంబ్లీ ఏరియాల్లో భారీగా పోలీసులు మోహరించారు.

## అధికారులపై ఒత్తిడితోనే వీఆర్ఎస్‌లు : ఎంపీ లక్ష్మణ్

**హైదరాబాద్, అక్టోబర్ 23 :** రేవంత్‌రెడ్డి పాలనలో ఐఏఎస్ అధికారులు భయపడుతూ ఉద్యోగాలు చేస్తున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్ ఆరోపించారు. వారి స్వార్థం కోసం అధికారులపై ఒత్తిడి తేస్తున్నారని మండిపడ్డారు. ఇదివరకు ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు లేవని పేర్కొన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ వీఆర్ఎస్ తీసుకోవడం రాష్ట్ర ప్రభుత్వ వ్యవహార శైలిపై అనుమానాలకు తావిస్తోందని అన్నారు. రిజ్వీ ఎందుకు వీఆర్ఎస్ తీసుకోవాల్సి వచ్చిందో రాష్ట్ర ప్రభుత్వం జవాబు చెప్పాలని డాక్టర్ లక్ష్మణ్ ప్రశ్నించారు. 'మంత్రులు ఒత్తిడికి లొంగకపోతే వాళ్లని బలి చేస్తారా..?' అని ఆయన దుయ్యబట్టారు. 'మీ స్వార్థం కోసం అధికారులని వేధిస్తారా..?' అని లక్ష్మణ్ ఘాటుగా విమర్శించారు. ఇంకా విచారణ పేరుతో సీనియర్ ఐఏఎస్ అధికారిని వేధించడం తగదని ఆయన హితవు పలికారు. ఒకవేళ తప్పుచేసి ఉంటే ఇన్నిరోజులు ఎందుకు మాట్లాడలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని, మంత్రులను ఆయన నిలదీశారు.

## హైదరాబాద్‌లో భారీగా గంజాయి పట్టివేత

**హైదరాబాద్, అక్టోబర్ 23 :** నగరంలోని బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీగా గంజాయి పట్టుబడింది. గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 2.7 కోట్ల విలువైన 908 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేశారు. ఈ వ్యవహారంపై సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్ మీడియాతో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. గంజాయి సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేశామన్నారు. బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న నిందితుల్ని అరెస్టు చేశామని.. సుమారు 908 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని.. బహిరంగ మార్కెట్లో దీని ధర రెండు కోట్ల 70 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఒడిశాలోని మల్కన్‌గిరి ప్రాంతం నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్ర నాసిక్ వైపు రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఏ1 మొహమ్మద్ కలీం ఉద్దీన్ డ్రైవర్ / గంజాయి ట్రాన్స్‌పోర్టర్, ఏ2 షేక్ సోహైల్, ఏ3 మొహమ్మద్ అఫ్జల్ ఏ అబ్బులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన రహమాన్, ఒడిస్సాకు చెందిన జిథు , శ్రీకాకుళానికి చెందిన సురేష్, మహారాష్ట్రకు చెందిన మహేష్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు చెప్పారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందన్నారు. మహారాష్ట్రకు చెందిన మహేష్ గంజాయిని కొనుగోలు చేస్తున్నాడని తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరిలో మారుమూల అటవీ ప్రాంతంలో సురేష్ , జిథు గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రలో వివిధ ప్రాంతాలకు సరఫరా చేయడానికి ప్లాన్ చేశారని.. గంజాయి సరఫరాలో రెహమాన్ ప్రధాన రవాణాదారు డుగా వ్యవహరిస్తున్నాడని చెప్పారు. రిసీవర్ మహేష్



ఒడిశాలోని జిథు, సురేష్ వద్ద గంజాయి సేకరించారన్నారు. ఐషర్ డీసీఎం ట్రాన్స్‌పోర్ట్ వాహనం, నాలుగు మొబైల్ ఫోన్లను సీజ్ చేశామని చెప్పారు. గంజాయిని (28) హెచ్‌డీపీఈ సంచుల్లో నింపి, వాటిని జీడిపప్పు కింద దాచిపెట్టి టార్పాలిన్‌తో కప్పి రవాణా చేస్తున్నారని వివరించారు. హైదరాబాద్ మీదుగా నాసిక్, మహారాష్ట్ర వైపు రవాణా చేస్తున్నారన్నారు. పక్కా సమాచారంతో బండ్లగూడ వద్ద సోదాలు చేయగా గంజాయి పట్టుబడిందన్నారు. ప్రధాన నిందితుడు సురేష్ ఒక్క ట్రిప్‌కు రూ. 3 నుంచి 5 లక్షల పారితోషికం ఇస్తానని రెహమాన్‌కు ఆఫర్ చేశాడని.. అందుకే గంజాయి సరఫరాకి దాంతో రెహమాన్ అంగీకరించాడన్నారు. నిందితులంతా చిన్ననాటి స్నేహితులుగా దర్యాప్తులో తేలిందని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్ పేర్కొన్నారు.

## గ్రూప్-1 నియామకాల్లో అక్రమాలు

### సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కవిత లేఖ

**హైదరాబాద్, అక్టోబర్ 23:** తెలంగాణ గ్రూప్–1 నియామకాల్లో అక్రమాలు జరిగాయని, వాటిపై విచారణ జరిపించాలని కోరుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత లేఖ రాశారు. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రూపు–1 నియామకాల్లో రాష్ట్రపతి ఉత్తర్వులను ఉల్లంఘించారని పేర్కొన్నారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌కు విరుద్ధంగా నియామకాలు చేపట్టినట్టు తనకు నిరుద్యోగులు ఫిర్యాదులు చేశారని పేర్కొన్నారు. నిరుద్యోగులు లేవనెత్తుతున్న అంశాలపై విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. గ్రూప్–1 పరీక్షల్లో ప్రిలిమ్స్‌కు ఒక హాల్ టికెట్ నంబర్, మెయిన్స్‌కి మరొక హాల్ టికెట్ నంబర్ ఇవ్వడం వల్ల విద్యార్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని లేఖలో రాసుకొచ్చారు. గ్రూపు–1 పేపర్ల మూల్యాంకనంలో తమకు అన్యాయం జరిగిందని తెలుగు మీడియం అభ్యర్థులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో ఇటీవలే గ్రూప్–1 ఉద్యోగాలకు ఎంపికైన 562 అభ్యర్థులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసిన సంగతి తెలిసిందే.

# డబుల్ ఇంజిన్‌తో పెరిగిన కాలుష్యం!



దీపావళితో దేశరాజధాని ఢిల్లీ కాలుష్యం మరోమారో చర్చకు వస్తుంది. నిజానికి కాలుష్యానికి మూలం కనుక్కొని పనిచేయాలన్న పట్టుదల ప్రభుత్వంలో లేదు. ఆప్ ఉన్నప్పుడు, ఇప్పుడు బిజెపి అధికారంలోకి వచ్చినా పరిస్థితి మారడం లేదు. డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చినా ఢిల్లీ కాలుష్యంపై కదలిక లేదు. ఇంత కాలం ఆప్‌ను తిట్టి పోసిన బిజెపి ఏం చేయబోతున్నదో చెప్పడం లేదు. అసలు కాలుష్యం ఎక్కడి నుంచి ఎలా వస్తున్నదన్న దానిపై అధ్యయనాలు ఉన్నాయి. యమునా కాలుష్యం కూడా ఉంది. వరదలు వస్తే ఢిల్లీని ముంచెతుతున్నాయి. ఇవి మానవ తప్పిదాల వల్ల జరుగుతున్న అనర్థాలు. వీటిని కఠిన నిర్ణయాలతో అరికట్టవచ్చు. కానీ రాజకీయాల కారణంగా పనులు చేయడం లేదు. బిజెపి చిత్తశుద్ధిని చాటుకుని ఢిల్లీ ఔన్నత్యాన్ని నిలబెట్టాలి. ప్రధానంగా  కాలుష్యం నిలువరించడంతో పాటు, యమునా కాలుష్యాన్ని కూడా నిలువరించాలి. అలాగే ట్రాఫిక్ సమస్య కూడా తీవ్రంగా మారింది. ఢిల్లీకి వలసలు పెరగడమే ఇందుకు కారణం. ఈ సమస్యలపై డబుల్ ఇంజన్ సర్కార్ గట్టిగా కృషిచేయకపోతే ప్రజలు ఇకముందు బిజెపిని నమ్మరు. పలుమార్లు సుప్రీంకోర్టు హెచ్చరికలు చేసినా పట్టించుకోవడం లేదు. ఇది దారుణం కాక మరోటి కాదు. పంజాబ్, హర్యానాల్లో పంటలను తగులబెట్టే ప్రక్రియను సత్వరం నిలుపుదల చేయాలి. దీపావళి పటాకుల మోత తరవాత దేశ రాజధాని నగరం ఢిల్లీలో వాయు కాలుష్యం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరడం తీవ్ర ఆందోళనకరంగా ఉంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పండగపూట టపాసులు కాల్చనీయకుండా ఆప్ ప్రభుత్వం హిందువులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందంటూ ఆరోపించిన బిజెపి నేతలు, అధికారంలోకి వచ్చిన తరువాత కూడా అదే విధంగా వ్యవహరించారు.

తాము అధికారంలోకి వచ్చిన తరువాత కూడా దీపావళిని దీపాలతో సరిపెడితే ఎలా అని బాహాటంగానే ప్రశ్నించారు. కేంద్రంతో పాటు, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన ఈ వైఖరితో గ్రీన్‌క్రాకర్స్ అమ్మకాలకు సుప్రీంకోర్టు అనుమతిని ఇచ్చింది. గత ఏడాది ఆప్ ప్రభుత్వం దీపావళికి కొద్దిరోజుల ముందు అన్ని రకాల బాణాసంచా విక్రయాల పై నిషేధం విధించినా, ఆ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరిగిదంటూ సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వాతావరణాన్ని కలుషితం చేయమని ఏ మతమూ చెప్పదని, ప్రాథమిక హక్కు అయిన ఆరోగ్యాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రభుత్వాలు కాపాడి తీరాలని అప్పట్లో స్పష్టం చేసిన అత్యున్నత న్యాయస్థానం తాజాగా దానినుండి వైదొలగడం గమనార్హం. సుప్రీంకోర్టు గ్రీన్ క్రాకర్స్‌కే అనుమతి ఇచ్చినప్పటికీ ఆ పేరుతో అన్ని రకాల బాణాసంచా ఢిల్లీ నగరంలోకి ప్రవేశించింది. నిజానికి, దీపావళికి ముందే ఈ ఏడాది దేశ రాజధానిలో వాయు కాలుష్యం తీవ్రంగా నమోదైంది. అయినా, అత్యున్నత న్యాయస్థానం ముందు జరిగిన విచారణలో ఢిల్లీలోని బిజెపి ప్రభుత్వంతో పాటు, కేంద్ర ప్రభుత్వం కూడా ఢిల్లీలో టపాసుల అమ్మకాల మీద నిషేధాన్ని ఎత్తివేయించేందుకు శక్తివంచన లేకుండా పాటుపడ్డాయి. కొన్ని పరిమిత గంటల్లోనే బాణాసంచా కాల్చడానికి అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన అనుమతి సైతం ఆచరణలో అమలు కాలేదు. ఇప్పుడు పరిస్థితులు చేయిదాటే ప్రమాదం కనపడుతుండటంతో సాక్షాత్తు ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సాతో పాటు ప్రభుత్వంలోని మరికొందరు పంజాబ్ రైతులను గడ్డి తగలపెట్టేలా ఆప్ నేతలు ఒత్తిడి చేశారని, దాని ఫలితంగానే ఢిల్లీలో ఈ పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు.

ఇది పూర్తిగా బాధ్యతారహిత ప్రకటనగానే చూడాలి. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అత్యంత సున్నితమైన అంశాలను కూడా ఇలా వాడుకోవడం దారుణం. ఢిల్లీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా శాశ్వత ప్రాతిపదికన సమగ్ర చర్యలు చేపట్టాలి. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలి. కాలుష్య నియంత్రణ చట్టాలను కఠినంగా అమలు చేయాలి. లేని పక్షంలో దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య రాజధానిగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ఇకపోతే కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి విడుదల చేసిన నివేదిక ప్రకారం కాలుష్య కారక సూక్ష్మ కణాల స్థాయి పిఎం 2.5 గడిచిన ఐదేళ్ల కాలంలోనే అత్యధికంగా నమోదైంది. దీపావళి తరువాత 24 గంటల్లో సగటు పిఎం2.5 సాంద్రత ఒక క్యూబిక్ మీటర్‌కు 488 మైక్రో గ్రాములకు చేరింది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ  నిర్దేశించిన భద్రతా పరిమితికి దాదాపు 60 రెట్లు అధికం కావడం గమనార్హం. దీంతో ఢిల్లీ నగరమంతా ఒక రకమైన భయానక వాతావరణం నెలకొంది. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. అనేక ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు మూతపడగా అత్యవసర మైన పనులుంటేనే ఇళ్ల నుండి బయటకు రావాలని ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించడంతో పరిస్థితి తీవ్రత ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అనివార్య పరిస్థితుల్లో జాతీయ రాజధాని పరిధిలోని ఢిల్లీ నగరమంతా గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ నిబంధనలను అమలులోకి తీసుకువచ్చి సెంట్రల్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ రంగంలోకి దింపాల్సి వచ్చింది. అదే సమయంలో పెద్ద సంఖ్యలో ఢిల్లీ ప్రజానీకం శ్వాసకోస సమస్యలతో ఆసుపత్రుల ముందు బారులు తీరుతున్నారు. వీరిలో వృద్ధులు, పసిపిల్లలు ఎక్కువగా ఉన్నారంటూ వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. సిపిసిబి తాజాగా చేసిన విశ్లేషణ ప్రకారం దీపావళి తరువాత సగటు పిఎం2.5 స్థాయి ప్రతి ఏడాది పెరుగుతూనే ఉంది. అయితే, గత ఐదేళ్ళ కాలంలో ఈ స్థాయిలో పెరుగుదల లేదు. రాజకీయాలను పక్కన పెట్టి సమస్యలను అధిగమించే ప్రయత్నాలు ఇప్పటికైనా చేయాలి. దేశ రాజధాని కాలుష్యం నుంచి బయటపడేలా చేయాలి. రాజకీయాలకు ఇక కాలం చెల్లిందని పాలకులు, ప్రతిపక్షాలు గుర్తించి ఉమ్మడిగా కాలుష్య నివారణకు పాటుపడాలి.

# చిత్తశుద్ధితోనే గాజాలో శాంతి

## పరస్పర విశ్వాసం కూడా ముఖ్యం



**గాజా, అక్టోబర్ 23 :** కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చి పది రోజులు గడిచినా తమ జీవితాల్లో చెప్పుకోదగ్గ మార్పులేమీ కనిపించడం లేదని అటు పాలస్తీనియన్లు, ఇటు ఇజ్రాయిల్స్ వాపోతున్నారు. ఇజ్రాయిల్ బలగాలు చెదురుమదురుగా కాల్పులు జరుపుతునే వున్నాయని, ఆహార ట్రక్కులు రాకుండా అడ్డుకుంటునే వున్నాయని, దాంతో తమకు పాట్లు తప్పడం లేదని వారు పేర్కొం టున్నారు. గాజాలోకి ప్రవేశించేందుకు ఆరు వేలకు పైగా ట్రక్కులు వేచి వున్నాయని యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ తెలిపింది. ఇదిలావుండగా, దాడుల సమయంలో శిధిలాల గుట్టల కింద చిక్కుకునిపోయి మరణించిన తమ వారి మృతదేహాలను వెలికి తీయడం రోజురోజుకు సవాలుగా మారుతోంది. ఇంకా వేలాది మృతదేహాలు అక్కడే వున్నాయని గాజా పౌర రక్షణ దళ సభ్యులు తెలిపారు. పరిమితమైన పరికరాలు వుండడంతో పని సాగడం లేదని చెప్పారు. హమాస్ తన వద్ద గల మరో ఇద్దరు బందీల మృతదేహాలను ఇజ్రాయిల్‌కు గత రాత్రి అప్పగించింది. వీరిలో ఒకరు సైనికుడు కాగా, మరొకరు సామాన్య పౌరుడు. మరోవైపు ఇజ్రాయిల్ కూడా మరో 30మంది పాలస్తీనియన్ల మృతదేహాలను అప్పగించింది. వారి శరీరాలపై వేధించిన, కొట్టిన గుర్తులు కనిపిస్తున్నాయని గాజా ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. కళ్లకు గంతలు కట్టేసి, చేతులకు సంకెళ్లు వేసి కూడా వున్నాయని పేర్కొన్నారు. గాజాలో టుఫా ప్రాంతంలో ఇజ్రాయిల్ బలగాలు జరిపిన కాల్పుల్లో ఒకరు మరణించారు. ఇదిలావుంటే కాల్పుల విరమణ ఒప్పందాన్ని సజావుగా అమలు చేయడం అంత సులభం కాదని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందాన్ని ఇజ్రాయిల్ నిలబెట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హమాస్ ఆయుధాలన్నింటినీ అప్పగించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఇకపోతే ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడి, నాజీ పాలన తర్వాత జరిగిన అతి పెద్ద మానవ ఊచకోతగా చూడాలి. ఈ దాడి ప్రధానంగా జరిగింది మిలిటరీ మీద కాదు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం చనిపోయిన వారిలో సుమారు 850మంది పౌరులు ఉండగా 350మంది మిలిటరీ పోలీసులు ఉన్నారు. ఈ దాడిలో సేఫ్ హౌస్‌లో దాక్కోడానికి ప్రయత్నించిన సాధారణ పౌరులను, వారు పిల్లలా, వృద్ధులా అన్నదానితో సంబంధం లేకుండా మంటల్లో తగలబెట్టారని ఐక్యరాజ్యసమితి నిర్ధారించింది. లూటీలు జరిగాయని, తలలు నరికివేయడం కూడా జరిగిందని ఆ నివేదిక తేల్చిచెప్పింది. అంతేగాక సెక్సువల్ వయెలెన్స్ మీద ఐరాస సెక్రెటరీ జనరల్ జరిపిన ప్రత్యేక పరిశోధనలో కిబ్బుట్జ్ ప్రాంతంలో రేప్‌లు, గ్యాంగ్ రేప్‌లు జరిగాయని తేలింది. ఎన్నోచోట్ల స్త్రీల అర్ధనగ్న, నగ్న దేహాలు పడివున్నాయని, మర్మాంగాల ఛేదనం జరిగిందని ఆ ఐరాస బృందం కనుగొన్నది. ఈ బృందం సుమారు 5000 ఫొటోలు, 50 గంటల నిడివి ఉన్న ట్రాఫిక్ కెమెరాలతో సహా అన్ని రకాల ఆడియో, వీడియో ఫైళ్లనూ పరిశీలించి, ప్రత్యక్ష సాక్షులను విచారించి ఈ నివేదికను రూపొందించింది. మొత్తంగా ఇప్పుడు ట్రంప్ ఆదేశాలతో శాంతి ఒప్పందం కుదిరినా హమాస్ దీనికి ఎంతవరకు కట్టుబడి ఉంటుందన్నది అనుమానమే.

# కేటీఆర్ పెడబొబ్బలు పెట్టి ఏం లాభం?

- పిచ్చి పిచ్చిగా వాగినంత మాత్రాన మొగోడివి కాదు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**హైదరాబాద్, అక్టోబర్ 23 :** సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాదులో మీడియాతో మాట్లాడిన ఆది శ్రీనివాస్ 'కేటీఆర్.. నువ్వెన్ని పెడబొబ్బలు పెట్టినా ఏం ఉపయోగం లేదు. మా ముఖ్యమంత్రి పైన పిచ్చి పిచ్చిగా వాగినంత మాత్రాన నువ్వు పెద్ద మొగోడివి కావు' అని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నంత కాలం కేటీఆర్, కేసీఆర్ ఇద్దరు కలిసి తెలంగాణను దోచుకున్నారని ఆరోపించారు. 'మీ బతుకు, నీ అయ్య బతుకు ఏమిటో తెలంగాణ ప్రజలు తేల్చేశారు. అధికారంలో ఉన్న రోజుల్లో సువర్ణపురం దొంగల్లా పాలన చేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రగతిభవన్ గడీ కట్టుకున్నారు. మీ పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలు కరివేపాకులా వాడి పారేశారు. మా ముఖ్యమంత్రి అందరినీ గౌరవంగా చూస్తారు. మీలా గేటు దగ్గర అవమానించి పంపించడం లేదు. వేదికలపై మంత్రులను ఈసడించుకోలేదు, ఈకముక్కలా తీసిపారేయలేదు. దళిత డిప్యూటీ సీఎంను కారణం చెప్పకుండా బర్తరఫ్ చేసిన చరిత్ర కూడా కేసీఆర్‌దే' అని ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. 'అవినీతి సొమ్ములో వాటా అడిగిన సొంత బిడ్డను పార్టీ నుంచి గెంటివేసింది మీ చరిత్ర. పదేళ్ల అధికారంలో నిజాయితీగల ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను పక్కన పెట్టి రిటైర్డ్ అధికారులతో రాజ్యం నడిపారు. తెలంగాణ పోలీసులు ఏం పీకుతున్నారంటూ వాగుతున్నారు. వెయిట్ చేయి.. అన్ని చూస్తున్నాం. సొంత ఇళ్లు చక్కబెట్టుకోలేని నువ్వు మా ముఖ్యమంత్రి గురించి మాట్లాడుతావా?. నీ చెల్లెలు అడిగిన ఒక్క ప్రశ్నకైనా ఇప్పటివరకు సమాధానం చెప్పావా?. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో కేటీఆర్ చేస్తున్న రాజకీయ ప్రదర్శనలను ఆపు. నువ్వెంత ఎగిరిపెడ్డా ఉపయోగం లేదు.. నీ మూతి పళ్లే రాలుతాయి చూసుకో' అంటూ కేటీఆర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.



# గోసంరక్షకుడు సోనూ సింగ్‌పై కాల్పులు బాధాకరం

## కేంద్ర మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, అక్టోబర్ 23 :** గోసంరక్షణ చేస్తున్న సోనూ సింగ్ అలియాస్ ప్రశాంత్ సింగ్‌పై కాల్పులు జరగడం బాధాకరమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. పోచారం కాల్పుల ఘటనలో గాయపడిన ఆయన్ను బండి సంజయ్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఓట్లు, డబ్బుల కోసమో ప్రశాంత్ సింగ్ ఇలా చేశారని చెప్పడం సరికాదని పేర్కొన్నారు. చేసిన వ్యాఖ్యలను పోలీసులు, సీఎం వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలోనూ గోవులు, గో రక్షకులకు రక్షణ లేదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీరు కూడా గోరక్షకుల పట్ల సరిగా లేదని చెప్పారు. ఈ ప్రభుత్వంలో మంత్రులే కొట్లాడుకుంటున్న పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. సర్కార్ నిలబడుతుందా.. కుప్పకూలుతుందా తెలియని పరిస్థితి నెలకొందని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు.

# సీఎం అభ్యర్థిగా తేజస్వీయాదవ్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 23 :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం సమీపిస్తుంది. అలాంటి వేళలో సైతం విపక్ష కూటమి మహాగర్‌బంధన్‌లో సీట్ల సర్దుబాటు ఒక్క కొలిక్కి రావడం లేదు. అయితే ఈ కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిపై మాత్రం ఏకాభిప్రాయానికి వచ్చినట్లు మీడియా కథనాల ద్వారా వెల్లడి అవుతోంది. సీఎం అభ్యర్థిగా ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడు తేజస్వీ యాదవ్‌ను ఎంపిక చేసినట్లు ఆ కథనాల సారాంశం. దీనిపై ఈ రోజు అంటే.. గురువారం సాయంత్రం మహాగర్‌బంధన్‌లోని పార్టీలన్నీ కలిసి ప్రకటిస్తాయని సమాచారం. 243 స్థానాలున్న బిహార్ అసెంబ్లీకి రెండు దశల్లో.. అంటే నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఆర్జేడీ 143 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. ఇక కాంగ్రెస్ పార్టీ 61 స్థానాల్లో అభ్యర్థులను నిలిపింది. సీపీఐ 9, సీపీఐ (ఎం) 4 స్థానాల్లో అభ్యర్థులను రంగంలోకి దింపింది. మరో ఎనిమిది స్థానాల్లో మాత్రం ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలు.. ఎవరికి వారు తమ అభ్యర్థులను రంగంలోకి దింపాయి. అంటే మహాగర్‌బంధన్‌లోని పార్టీల అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొందని దీనిని బట్ట అర్థమవుతుంది. అయితే ఈ కూటమిలో చీలక ఏర్పడిందంటూ ఇప్పటికే పుకార్లు షికారు చేస్తున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు నవంబర్ 14వ తేదీన వెలువడనున్నాయి. దీంతో ఏ పార్టీకి ఓటరు పట్టం కట్టాడనేది ఆ రోజు సుస్పష్టం కానుంది.

# మహాకూటమి పోస్టర్ నుంచి రాహుల్ ఫొటో అవుట్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 23 :** కూటమి తరఫున సీఎం అభ్యర్థి ప్రకటన కోసం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ పోస్టర్ల నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫొటో మాయమవడం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమవుతోంది. వచ్చే నెల బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నేడు ప్రతిపక్ష కూటమి పార్టీలు పాట్నాలోని ఓ హోటల్‌లో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోస్టర్లలో ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్  ఫొటోను మాత్రమే ప్రముఖంగా ప్రదర్శించారు. మిగతా భాగస్వామ్య పార్టీల నేతల చిన్న ఫొటోలను పోస్టర్లలో ఏర్పాటు చేశారు. అయితే, అందులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఫొటో మాత్రం ఎక్కడా కనిపించలేదు. ఈ వ్యవహారం ప్రస్తుతం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఇందుకు సంబంధించిన పోస్టర్లు కూడా నెట్టింట వైరల్‌గా మారాయి. దీనిపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఈ మేరకు విమర్శలకు ఎక్కుపెట్టింది. తేజస్వి యాదవ్, ఆయన మద్దతుదారులు.. రాహుల్ నాయకత్వాన్ని అవమానించారంటూ వ్యాఖ్యానించింది. తాజా పరిణామాలపై బీజేపీ నేత షెహజాద్ పూనవాలా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'నిన్నటి వరకూ రాహుల్ గాంధీయే కూటమి ముఖచిత్రంగా చెప్పుకున్నారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం గౌరవం లేదని స్పష్టమవుతోంది. ఈ కూటమికి గందరగోళం, విభజన, పదవుల కోసం ఆశ తప్ప.. ఒక లక్ష్యం గానీ, దార్శనికత గానీ లేవు' అంటూ ఎద్దేవా చేశారు.



# మళ్లీ 2,600 పెరిగిన బంగారం ధర..

**హైదరాబాద్:** అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో నిన్న దిద్దుబాటుకు గురైన బంగారం, వెండి ధరలు గురువారం మళ్లీ పెరిగాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల పసిడి ధర క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.2,600 పైనే పెరిగింది. నేటి మార్కెట్లో 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల ధర రూ.1,28,300కు చేరింది. ఇక, 22 క్యారెట్ల ధర రూ.1,14,650గా ఉంది. అటు వెండి ధర కూడా దాదాపు రూ.3వేలకు పైనే పెరిగింది. నేటి మార్కెట్‌లో కేజీ వెండి ధర రూ.1,59,500 పలికింది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు పుత్తడి ధర 4,121 డాలర్లుగా ఉంది. ఇక, ఔన్సు వెండి ధర 49.18 డాలర్లకు చేరింది. రికార్డు గరిష్ఠాలకు చేరిన ఈ లోహాల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం, భారత్ సహా వివిధ దేశాల సుంకాల విషయంలో అమెరికా దిగి వస్తోందనే సంకేతాలతో నిన్న బంగారం, వెండి ధరలు కాస్త దిగొచ్చాయి. అయితే, రాబోయే పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో దేశీయంగా గిరాకీ ఉండటంతో వీటి ధరలు మళ్లీ పెరుగుతున్నాయి.

# కార్తీక మాసం ప్రారంభం

## విశేషంగా శివకేశవ పూజలు

## వ్రతాలు నోములకు ప్రత్యేకం



**తిరుమల, అక్టోబర్ 23 :** హిందువులు ఎంతో పవిత్రంగా భావించే కార్తీకమాసం అక్టోబర్ 22 బుధవారం నుంచి ప్రారంభమైంది. ఈ మాసంలో వ్రతాలు, నోములకు ప్రత్యేక ప్రాధన్యం ఉంది. కార్తీక మాసం  తదుపరి వచ్చే అమావాస్య వరకు  అంటే నవంబర్ 20 వరకు కొనసాగుతుంది. శివకేశవులకు అత్యంత ప్రీతి పాత్రంగా ఈ మాసాన్ని చెబుతారు. ఎంతో పవిత్రమైన కార్తీకమాసంలో పండుగలకు కూడా విశేష స్థానం ఉంది. కార్తీకమాసంలో  సూర్యోదయానికి ముందే నదీస్నానం చేసి శివకేశవ పూజలు చేస్తారు. ఈ మాసంలో శివుడికి దీపారాధన చేసి పూజలు చేసిన వారికి విశేషమైన పుణ్యం లభిస్తుందని.. తద్వారా ఈతి బాధలు తొలగిపోతాయని విశ్వాసం. అందుకే చాలా మంది శివ భక్తులు సాయంత్రం వేళ గుడిలో దీపారాధన చేస్తారు. ఇలా చేయడం వల్ల జన్మజన్మల పాపాలు తొలగిపోతాయని పండితులు చెబుతున్నారు. కార్తీకమాసంలో పండుగల వివరాలు ఇలా ఉన్నాయి.  అక్టోబర్25 శుక్రవారం నాగుల చవితితో పాటు ..మాసిక వినాయక చతుర్థి వ్రతం ఆచరిస్తారు. మరుసటి రోజును లాభ పంచమిగా ఆచరిస్తారు. ఇకపోతే అక్టోబర్ 27న తొలి కార్తీక సోమవార , స్కంద షష్ఠి, ఛత్ పూజ నిర్వహిస్తారు. 29న బుధ అష్టమి వ్రతం, 30న గోపాష్టమి, మాసిక్ దుర్గా అష్టమిగా భావిస్తారు.31న అక్షయ నవమి, జగద్ధాత్రి పూజ చేపడతారు. నవంబర్ 1శనివారం ప్రబోధిని ఏకాదశి, కంస వధ, భీష్మ పంచకంగా ఆచరిస్తారు.నవంబర్ 2 ఆదివారం తులసీ వివాహం, వైష్ణవ దేవుత్థాన ఏకాదశి, యోగేశ్వర ద్వాదశిగాను 3న  కార్తీక  సోమ ప్రదోష వ్రతం, వైకుంఠ ,విశ్వేశ్వర వ్రతం,చతుర్దశి పూజలు నిర్వహిస్తారు.  నవంబర్4న మణికర్ణిక స్నానం, నవంబర్5 కార్తీక పూర్ణిమ,దేవ్ దీపావళి, భీష్మపంచకం ముగింపు, గురునానక్ జయంతి,పుష్కర స్నానం ఆచరిస్తారు. నవంబర్ 8 : సంకష్టహర చతుర్థి, సౌభాగ్య సుందరి తీజ్? నవంబర్ 10: కార్తీక సోమవారం కానుంది. 17న కార్తీక సోమవారం ప్రదోష వ్రతం చేపడతారు. నవంబర్ 20తో కార్తీక మాసం ముగుస్తుంది.

# తుమ్మలతో పసుపుబోర్డు సెక్రటరీ భేటీ

**హైదరాబాద్, అక్టోబర్ 23 :**  తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన పసుపు బోర్డు గత ఆరు నెలలుగా చేపట్టిన కార్యక్రమాల వివరాలు బోర్డు సెక్రెటరీ ఎన్. భవానీశ్రీ.. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వివరించారు. సచివాలయంలో మంత్రి తుమ్మలను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా పసుపు సాగుచేసే అవకాశాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం సాగులో ఉన్న రకాలకు బదులుగా అధిక కుర్కుమిన్ శాతం ఉన్న రకాలు సాగు చేయించే విధంగా ప్రోత్సహించాలని కోరారు. పసుపు ఉత్పాదకాల మార్కెటింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పసుపు రైతు ఉత్పత్తి సంఘాలను గుర్తించి రూ.23 లక్షల వరకు రాయితీ కల్పించాలని భవానీశ్రీ కోరారు.



## సీతారామ పాలేరు కెనాల్ పనులు
# వేగవంతంగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** 2026 ఖరీఫ్ సీజన్ నాటికి సాగునీరు అందించే విధంగా ప్రణాళికతో సీతారామ పాలేరు కెనాల్ టన్నెల్ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు, దమ్మాయిగూడెం గ్రామాలలో జరుగుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు 16వ ప్యాకేజీ లోని పాలేరు లింకు కెనాల్ టన్నెల్ పనులను గురువారం క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 2026 ఖరీఫ్ నాటికి గోదావరి, మున్నేరు జలాలను మన ప్రాంత రైతులు వినియోగించుకునే విధంగా నిర్మాణంలో ఎదురవుతున్న ఇబ్బందులను ఎప్పటి కప్పుడు పరిష్కరిస్తూ, చేపట్టిన ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. 8.2 కిలోమీటర్ల సొరంగం తవ్వకం పనులకు గాను ప్రతిరోజు 24 మీటర్ల మేర పనులు చేపట్టి ఇప్పటి వరకు నాలుగు కిలోమీటర్ల పనులు పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన టన్నెల్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా పోచారం వద్ద పెండింగ్ ఉన్న భూ సేకరణ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇరిగేషన్ ఎస్ఇ యం. వెంకటేశ్వర్లు, డిఇ రమేష్ రెడ్డి, తహసీల్దారు విల్సన్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# శివ సత్తులను ఆదుకోవాలి

**బహుజన పూజారుల రాష్ట్ర అధ్యక్షులు ధర్మసోత్ బాబురావు**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన శివ సత్తులను ప్రభుత్వం గుర్తించి, ఆదుకోవాలని బహుజన పూజారుల, శివసత్తుల సేవాసమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ధర్మసోత్ బాబురావు అన్నారు. తిరుమలాయపాలెం మండలంలోని కాకరవాయి గ్రామంలో శివసత్తుల రాష్ట్ర కో కన్వీనర్ కొత్తపల్లి సరిత అధ్యక్షతన గురువారం ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధించే బహుజన పూజారులు, గ్రామ పూజారులు, శివ సత్తులు, సాధువులు, ఘనసారులు, దేవడమ్మలు సనాతన హిందూ ధర్మాన్ని పాటిస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. బహుజన పూజారులకి దేవుళ్ళ, దేవతలు ఆవహించి వారితో పూనకం వ్యాక్యాలు చెబుతూ భక్తుల కోరికలు తీర్చడం జరుగుతుందన్నారు. శివసత్తుల మూలాలని సీఎం రేవంత్ రెడ్డి గుర్తించి నెలకి పది వేల రూపాయల జీవన భృతి, శివ సత్తుల బందు ప్రకటించి, జీఓ నెం 97 అమలు చేసి, జిఓ నెం 177 ప్రకారం దూప, దీప నైవేద్యాలు, జీవన భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కొందరు శివసత్తులపై అసత్య ప్రచారాలు చేస్తూ, బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అలాంటి తప్పుడు ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చీమల కోటేశ్వరరావు, శివశక్తుల రాష్ట్ర మహిళా కన్వీనర్ కొత్తపల్లి సరిత, శివసత్తులు గుంతేటి రమాదేవి, మద్ది మల్లమ్మ, చింతలూరి లక్ష్మి, వంగవీటి అనిత, కట్ల ఉమారాణి, తవడబోయిన ఉప్పమ్మ, రామనబోయిన ఉప్పమ్మ, కట్ల ఉమారాణి, గుండాల భద్రమ్మ, చింతలూరి గోపలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



## ఈ నెల 31లోగా ఇందిరమ్మ ఇళ్ల మార్కవుట్
# వందశాతం పూర్తి చేయాలి

- నిర్మాణ పనులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** గ్రామ పంచాయతీలు , వార్డులలో అధికారులు ఫీల్డ్ విసిట్ చేయాలని అర్హులైన లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని ఇంకా మిగిలి ఉన్న మార్కవుట్ పనులను వేగవంతం చేసి వందశాతం పూర్తి చేయాలని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల తీరు పై తన ఛాంబర్ లో సంబంధిత అధికారులు పిడి హౌసింగ్, మెప్మా, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, డి.ఇ, ఎ.ఇ.లతో సమీక్ష సమావేశం నిర్వహించి గడువులోగా మార్కవుట్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం జిల్లాలో సమగ్రంగా నిర్వహించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్లు నిర్మించుకునేల వారికి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన మార్కవుట్ (హౌస్ సైట్) పనులు వంద శాతం పూర్తి చేయాలని, ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు కట్టివ్వాలనే లక్ష్యంతో అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద ప్రతి అర్హత గల కుటుంబం త్వరితగతిన తమ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించేందుకు అవసరమైన స్థల మార్కింగ్ పనులు తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. ఎంపిడిఓ లు, ఎం.పి.వో.లు తమ తమ మండలాల్లో పర్యవేక్షిస్తూ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతి పై ఎప్పటికప్పుడు నివేదిక సమర్పించాలని అన్నారు. ఇంజనీరింగ్ అధికారులు, గృహనిర్మాణ శాఖ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మార్కవుట్ పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం వహించిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అదేవిధంగా, మార్కవుట్ పూర్తి చేసిన గ్రామాల వివరాలు ప్రతిరోజూ అప్‌డేట్ చేయాలని, వంద శాతం లక్ష్యాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా ప్రత్యేక మానిటరింగ్ బృందాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. పేదలకు సొంత గృహం కల స్వప్నం సాకారం అవుతుందని ఈ సందర్భంగా తెలిపారు. లబ్దిదారులు ఇళ్లు నిర్మించుకునే సమయంలో ఇబ్బందులు తలెత్తితే నిర్మాణానికి అవసరమైన నిధులను మహిళా సంఘాల (స్వయం సహాయక సంఘాలు) ద్వారా లోన్ రూపంలో లబ్ధిదారులకు అందించాలని, లబ్ధిదారులు ఇళ్లు సమయానికి పూర్తి చేసుకునే అవకాశం లభిస్తుందని, మహిళా సంఘాల ద్వారా ఆర్థిక సాయం అందించడం వల్ల గ్రామీణ మహిళల ఆర్థిక స్థితి బలోపేతం అవుతుందన్నారు. నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశం లో పి.డి. హౌసింగ్ విజయపాల్ రెడ్డి, పి.డి. మెప్మ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, డి. ఇ., ఎ.ఇ.లు తదితరులు పాల్గొన్నారు.





# మాగంటి సునీత గెలుపు ఖాయం

**మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి**

- జూబ్లీహిల్స్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, మాజీ కార్పొరేటర్లు, పలువురు నాయకులు

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ కు మద్దతుగా రహమత్ నగర్ డివిజన్ ప్రచారంలో మాజీమంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి, ఘట్కేసర్ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ గౌడ్, కిరణ్ నాయక్, వరికల శ్రీనివాస్, సాయి, లోకేష్, తదితరులు కలిసి పాల్గొని కారుగుర్తు కి ఓటు వేసి మాగంటి సునితమ్మను గెలిపించాలని అభ్యర్థించారు.

## ఆరోగ్యం పట్ల జర్నలిస్టులు
# అప్రమత్తంగా ఉండాలి

**తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి**

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** కంటి నిండా నిద్ర లేకుండా, కడుపునిండా తిండి లేకుండా విధినిర్వహణలో భాగంగా నిత్యం పని ఒత్తిడితో ఉండే జర్నలిస్టులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గురువారం నాడు దిల్ సుఖ్ నగర్ లోని లిఖిత డయాగ్నోస్టిక్ సెంటర్ లో, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో, జర్నలిస్టులకు నిర్వహించిన మెఘా హెల్త్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడారు. గత కొన్నేళ్లుగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు లేక పోవడంతో రాష్ట్రంలో వందల సంఖ్యలో ప్రాణ నష్టం జరిగిందని ఆయన విచారం వ్యక్తం చేసారు. ఈ విషయాన్ని తాను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు కూడా హెల్త్ కార్డులు అందించేలా చర్యలు చేపట్టినట్లు శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో అకాల మరణం చెందుతున్న జర్నలిస్టుల కుటుంబాలకు, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్న జర్నలిస్టులకు మీడియా అకాడమీ ద్వారా కొంతమేరకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఆయా ఆసుపత్రుల సహకారంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తూ, జర్నలిస్టులకు టీయూడబ్ల్యూజే సంఘం అండగా నిలబడడం అభినందనీయమన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మాట్లాడుతూ, జర్నలిస్టులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఎలాంటి జీత భత్యాలు లేకుండా శ్రమిస్తున్న జర్నలిస్టులు దీనస్థితిలో తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని, ఈ పరిస్థితుల్లో పిల్లలకు చదువులు, వైద్య ఖర్చులు వారికి మోయలేని భారంగా మారాయని ఆయన విచారం వ్యక్తం చేసారు. ఆయా ప్రభుత్వాలు జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు ఇచ్చినట్లే ఇచ్చి లాక్కోవడం సహించరానిదన్నారు. జర్నలిస్టుల



కనీస అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రాజేందర్ కోరారు. లి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం పట్ల ఏ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండా పోతుందని, ఆయా రాజకీయ పార్టీలు వారి అవసరాల కోసం జర్నలిస్టులను ఉపయోగించుకోవడం విచారకరమన్నారు. జర్నలిస్టుల కనీస అవసరమైన ఆరోగ్య భద్రతా పట్ల ఏ ప్రభుత్వానికి పట్టింపు లేకుండా పోయిందని, ఈ పరిస్థితుల్లోనే తమ సంఘం ప్రైవేట్ ఆసుపత్రుల సహకారంతో రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో జర్నలిస్టులకు ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. ఇప్పటివరకు 10చోట్ల ఈ క్యాంపులను నిర్వహించి దాదాపు 4వేల మందికి ఆరోగ్యపరంగా సహకారాన్ని అందించినట్లు విరాహత్ అలీ స్పష్టం చేసారు. యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీం పాషా అధ్యక్షతన ఈ సమావేశంలో శాసన మండలి సభ్యులు బుగ్గారపు దయానంద్, తెలంగాణ రోడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, స్థానిక కార్పొరేటర్ రంగ నర్సింహా గుప్తా, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మేకల సత్యనారాయణ, సీనియర్ నాయకులు రాధాక్రిష్ణ, ప్రవీణ్, నర్సింహా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# 29న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

**నేలకోండపల్లి ఎస్సై సంతోష్**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** నేలకొండపల్లి: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో సందర్భంగా ఈనెల 29న నేలకొండపల్లిలో ఏర్పాటు చేసే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని నేలకొండపల్లి ఎస్సై సంతోష్ కోరారు. రోడ్డు ప్రమాద బాధితులు, తలసేమియా, సికిల్ సెల్, డెంగ్యూ వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల సమయానికి బ్లడ్ బ్యాంకులో రక్త నిలువలు లేక పోవడం వల్ల మరణాలకు గురవుతున్నారని, అలాంటి వారి సమస్యలను దృష్టిలో పెట్టుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని, ఈ రక్తదాన శిబిరంలో రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలని సూచించారు. ఈ రక్తదాన శిబిరానికి మండల ప్రజలు, యువతీ, యువకులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



## బాబు యాదవ్ ఆధ్వర్యంలో
# కైతలాపూర్‌లో ఘనంగా సదర్ ఉత్సవాలు



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** కూకట్పల్లి నియోజకవర్గం బాలాజీ నగర్ డివిజన్ కైతలాపూర్ లో ఘనంగా సదర్ ఉత్సవాలు పిల్లి బాబు యాదవ్ ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా జరిగాయి. ఉత్సవాల సందర్భంగా ఆత్మీయ కలయిక అనే నినాదంతో అందరిని ఒక దగ్గరికి చేర్చి అలైబలై చేసుకోవడం జరిగినది. దున్నపోతుల విన్యాసాలతో వచ్చిన ప్రతి ఒక్క యాదవ సోదరులకు శాలువా కండువాలతో సత్కరించడం సత్కరించారు. ఈ సదర్ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా గోల్డ్ మాన్ దర్గా చిన్న గౌడ్, మూసాపేట్ కార్పొరేటర్ మహేందర్ యాదవ్, మహేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్, పాల్గొన్నారు అలాగే నియోజకవర్గంలోనీ నాయకులు బందు మిత్రులు పాల్గొన్నారు.



# విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

**మండల విద్యాధికారి బివి.రామాచారి**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేలా ప్రణాళిక ప్రకారం బోధన నిర్వహించాలని కూసుమంచి మండల విద్యాధికారి బివి. రామాచారి అన్నారు. కూసుమంచి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయులు హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రజ్ఞను పరిశీలించి వ్రాయడం, చదవడంను పరీక్షించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తరుణ వ్యాధులు వ్యాపించకుండా, పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వంటలో తాజా కూరగాయలు, పదార్థాలను వినియోగించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖి చేసి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తిని సంతృప్తిని వ్యక్తం చేశారు. క్రమం తప్పకుండా మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.



# బాధిత కుటుంబాలను పరామర్శ

**ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రేగ కళ్యాణి**

**ములుగు, రాజముద్ర న్యూస్:** తాడ్వాయి మండల కేంద్రంలో లింగాల గ్రామానికి చెందిన ఊకె సారయ్య, ఆగబోయిన మల్లేష్, అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదంలో మరణించారు. బంధాల గ్రామానికి చెందిన కుర్సం నర్సయ్య, అల్లిగూడెం గ్రామానికి చెందిన గుమ్మడి జగ్గారావు అనారోగ్యంతో గత కొద్ది రోజుల క్రితం మరణించగా వారి కుటుంబాలకు మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలతో, ములుగు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రేగ కళ్యాణి పరామర్శించి, తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ సహాయ సహకారాలతో, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు 10వేల రూపాయలు, అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలకు 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే వారి కుటుంబాలకు ఎల్లవేళలా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లు దేవేందర్, మేడారం ట్రస్టు బోర్డు చైర్మన్ అర్రెం లచ్చు పటేల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్రకోల తిరుపతి, పాక సాంబయ్య, ఇర్ప సునీల్, మంకిడి ప్రశాంత్, ఆగబోయిన రామయ్య, ఆగబోయిన సమ్మయ్య, గుమ్మడి మల్లేష్, కోరం రామారావు, యాషాడపు మల్లయ్య, సిద్ధబోయిన శ్రీను, ఊకె కృష్ణ, ఊకె పగడయ్య, ఊకె పోతరాజు, ఊకె నాగేష్, గుమ్మడి భాస్కర్, ఊకె సమ్మయ్య, ఊకె నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ

**ములుగు, రాజముద్ర న్యూస్:** ఏటూరునాగారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల ఐక్యుఏసి, ఈడిసి విభాగాల ఆధ్వర్యంలో ' గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సహకారంతో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి రేణుక అధ్యక్షత వహించి మాట్లాడుతూ... ఉత్సాహంగా ఉన్న విద్యార్థిని విద్యార్థులు సంస్థ చేపడుతున్న వివిధ శిక్షణ కోసమై దరఖాస్తులు చేసుకొని శిక్షణ పొంది స్వయం ఉపాధి వైపు నడవాలని, అన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం కోసం వచ్చిన ముఖ్య అతిథి, తవుడు నాయుడు విద్యార్థులకు వివిధ స్వయం ఉపాధి విషయాల కల్పించారు. ఏటూరు నాగారం స్వయం ఉపాధి శిక్షణ సంస్థ బాధ్యులు ప్రభాకర్ స్థానిక ఏటూరునాగారంలో వివిధ స్వయం ఉపాధి కోర్సులపై ట్రైనింగ్ నిర్వహించబడుతుందని ఆసక్తిగా ఉన్న విద్యార్థులందరూ పేర్లను నమోదు చేసుకొని ఉచిత శిక్షణ పొందగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ ఆర్డినేటర్ డాక్టర్ డి నవీన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సిహెచ్ వెంకటయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి జ్యోతి ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ కనీస్ ఫాతిమా , సంపత్, జీవవేణి భాస్కర్, రమేష్, భావన, భారతి, శేఖర్, శ్రీధర్ పాల్గొన్నారు.

# ట్రంప్ కొత్త వ్యూహం..

## అతిపెద్ద రష్యా చమురు సంస్థలపై అమెరికా ఆంక్షలు

**యూఎస్ :** రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా తాజాగా రష్యాకు చెందిన రెండు అతిపెద్ద చమురు కంపెనీలైన రోస్‌నెఫ్ట్, లుకోయిల్ పై ఈ ఆంక్షలు విధించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, ట్రంప్‌ల భేటీ వాయిదా పడిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ ఆఫీస్ ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించడమే కాకుండా శాంతి ప్రక్రియపై రష్యాకు నిబద్ధత లేకపోవడం వల్లే ఈ ఆంక్షలు విధించినట్లు తెలిపింది. తమ నిర్ణయం ఆ దేశ చమురు రంగంపై ఒత్తిడి పెంచుతుందని, దీనివల్ల రష్యా ఆర్థికవ్యవస్థపై కూడా ప్రభావం పడుతుందని వ్యాఖ్యానించింది. శాశ్వత శాంతి పూర్తిగా రష్యా చర్చలు జరపడానికి రావడంపై ఆధారపడి ఉందని వెల్లడించింది. ట్రంప్ మాట్లాడుతూ.. ఇవి అపారమైన ఆంక్షలన్నారు. అయితే, ఇవి ఎక్కువకాలం ఉండవని, ఈలోపు యుద్ధ సమస్య పరిష్కారమవుతుందని వ్యాఖ్యానించారు. ఈ చర్యకు ఇదే సరైన సమయం అని తాను భావిస్తున్నట్లు కూడా తెలిపారు. ఈ ఆంక్షలతో యుద్ధం కారణంగా జరుగుతున్న హత్యలను ఆపడంతో




పాటు తక్షణ కాల్పుల విరమణకు సమయం ఆసన్నమైందని ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. అమెరికా మిత్ర దేశాలు తమతో కలవాలని, ఆంక్షలకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ట్రెజరీ ప్రకారం.. ఈ చర్య రష్యా తన సైనిక కార్యకలాపాలకు నిధులు సమకూర్చే సామర్థ్యం తగ్గుతుంది. దీంతో పాటు దాని చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థ బలహీన పడుతుంది. ఇక, ఈయూ కూడా రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు గాను 19 ఆంక్షల ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. రష్యా ఎల్ఎన్‌జీపై నిషేధం విధించడం కూడా ఇందులో ఉంది.

### భారత్ హామీ ఇచ్చింది : ట్రంప్

ఇదిలాఉండగా.. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేసే విషయంపై ట్రంప్ మరోసారి మాట్లాడారు. ఈ ఏడాది చివరి నాటికి భారత్ రష్యా నుంచి చమురు దిగుమతులను భారీగా తగ్గిస్తుందన్నారు. తగ్గింపు క్రమంగా ఉంటుందని, ఇది మంచి చర్య అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు భారత్ నుంచి తనకు హామీ వచ్చిందని కూడా తెలిపారు. ఈ విషయంపై ట్రంప్ గత కొన్ని రోజులుగా సొంత ప్రకటనలు చేస్తూ వస్తుండగా.. భారత్ వాటిని ఖండిస్తుంది. అయినా, అగ్రరాజ్యం అధ్యక్షుడు మళ్లీ మళ్లీ ఇలాంటి ప్రకటనలే చేయడం గమనార్హం.

## దమ్ముంటే మమ్మల్ని ఎదుర్కో

### పాక్ ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్‌కు హెచ్చరికలు



**పాకిస్థాన్ :** తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులు ఒకవైపు.. అఫ్గానిస్థాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు మరోవైపు పాకిస్థాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా యి. ఇప్పుడు టీటీపీ పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్‌ను హెచ్చరించింది. దమ్ముంటే తమను ఎదుర్కోవాలని సవాలు విసురుతూ వీడియోలు విడుదల చేసింది. తమమీదకు సిపాయిలను పంపించడం మానేసి.. ఉన్నతాధికారులే యుద్ధభూమికి రావాలని వ్యాఖ్యలు చేసింది. అలాగే అక్టోబర్ 8న ఖైబర్ పఖ్తుం ఖ్వా ప్రావిన్స్‌లో దాడి జరిపిన దృశ్యాలను విడుదల చేసింది. ఒక వీడియోలో కనిపించిన కమాండర్ పేరు కాజిమ్ అని పాక్ అధికారులు వెల్లడించారు. 'దమ్ముంటే మమ్మల్ని ఎదుర్కో' అని అందులో మునీర్‌ను హెచ్చరించాడు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా తీసుకున్న పాక్ అధికారులు కాజిమ్ తలపై 10కోట్ల పాకిస్థానీ రూపాయల రివార్డు ప్రకటించారు. అతడి గురించి సమాచారం ఇచ్చినవారికి ఆ మొత్తం ఇస్తామని వెల్లడించింది. తన భూభాగాన్ని ఉపయోగించుకుంటున్న తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులపై అఫ్గానిస్థాన్ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. సరిహద్దుల్లో దాడులకు పాల్పడే ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నారనే ఆరోపణలను అఫ్గాన్ ఖండించింది. ఆ అంశమే ఇరుదేశాల మధ్య తీవ్ర ఘర్షణలకు దారితీసింది. ఉగ్రవాదుల ఏరివేత పేరుతో ఇటీవల పాక్ చేసిన దాడులపై అఫ్గాన్ ప్రతీకార దాడులు చేసింది. కొన్ని రోజుల పాటు జరిగిన ఘర్షణలకు ఖతార్ రాజధాని దోహాలో ముగింపు పడింది. రెండు దఫాలుగా జరిగిన చర్చల్లో శాశ్వత శాంతి, స్థిరత్వం కోసం ఇరుదేశాలు తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయని ఖతార్ విదేశాంగశాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే.

## హెచ్-1బీ ఫీజు ఎఫెక్ట్..

### వలసల కోసం కెనడా కొత్త ప్లాన్



హెచ్-1బీ వీసా ఫీజు లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. దాంతో ఈ వీసా అభ్యర్థులను నియమించుకునే విషయంలో అమెరికా కంపెనీలు వెనకడుగు వేస్తున్నాయి. ఈ తరుణంలో కెనడా కొత్త ప్రతిపాదన చేసింది. ఈ ఫీజు పెంపుతో ప్రభావితమైన వారిని ఆకర్షించేందుకు ఇమిగ్రేషన్ విధానంలో మార్పులు చేయనున్నట్లు కెనడా ప్రధాని మార్క్ కార్నీ వెల్లడించారు. రానున్న బడ్జెట్‌లో దానికి సంబంధించిన కొత్త ప్రణాళికను ప్రకటించనున్నట్లు వెల్లడించారు. దేశ సామాజిక, ఆర్థిక అవసరాలకు తగినట్లు వలసలను అనుమతిస్తామని వెల్లడించారు. హెచ్-1బీ వీసా ద్వారా అమెరికా వెళ్లాలని కలలు కనే సాంకేతిక నిపుణులను కెనడా వైపు ఆకర్షించడమే ఈ కొత్త ప్రణాళిక లక్ష్యం. మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో విధించిన వలస ఆంక్షలనే ఆ దేశం కొనసాగిస్తోంది. తాజా ప్లాన్ ద్వారా దేశ అవసరాలు, ప్రజల ఆందోళనలను పరిగణనలోకి తీసుకొని తన వలస విధానంలో సవరణలు చేయనున్నట్లు తెలుస్తోంది. కాగా.. అమెరికా ప్రకటించిన లక్ష డాలర్ల ఫీజు పెంపు టెక్ సంస్థల్లో తీవ్ర గందరగోళాన్ని సృష్టిస్తోంది. అమెరికాలో చదువుకొని, ఉద్యోగాల కోసం హెచ్-1బీ వీసాకు దరఖాస్తు చేసుకొనే విదేశీ విద్యార్థులు లక్ష డాలర్లు చెల్లించాల్సిన అవసరం లేదంటూ మినహాయింపు ఇచ్చింది. ఈ భారీ మొత్తం ఫీజుతో అదనపు భారం పడనున్న నేపథ్యంలో.. పూర్తిస్థాయి స్పష్టత కోసం చూస్తున్న సంస్థలు హెచ్-1బీ వీసా అభ్యర్థుల నియామకాన్ని నిలిపివేస్తున్నాయి. అమెరికాకు చెందిన రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్, అమెరికాలో కార్యకలాపాలు నిర్వహిస్తోన్న టీసీఎస్ ఆ తరహా ప్రకటనలే చేసిన సంగతి తెలిసిందే.

## మలేసియాలో మోదీ- ట్రంప్ భేటీ లేదు

**న్యూఢిల్లీ :** మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో అక్టోబరు 26 నుంచి 28 వరకు ఆసియాన్ సదస్సు జరగనుంది. అయితే, ఈ సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కావడం లేదు. దీంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మోదీల మధ్య భేటీ లేనట్లే. షెడ్యూల్ సమస్యల వల్లే మోదీ ఇందులో పాల్గొనలేకపోతున్నట్లు తెలుస్తోంది. దీంతో మోదీకి బదులుగా విదేశాంగ మంత్రి జైశంకర్ భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ విషయాన్ని ప్రధాని మోదీ తాజాగా ధ్రువీకరించారు. మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ఫోన్‌లో మాట్లాడినట్లు ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు. అక్కడ జరగనున్న ఆసియాన్ సదస్సుల్లో వర్చువల్‌గా పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సు విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఆసియాన్- భారత్‌ల వ్యూహాత్మక భాగస్వామ్య బలోపేతానికి ఎదురుచూస్తున్నట్లు రాసుకొచ్చారు. ఈ సదస్సుకు వెళ్లని నేపథ్యంలో కంబోడియా పర్యటన కూడా వాయిదా పడింది. ఇక, ఈ సదస్సుకు ట్రంప్‌తో సహా అనేక దేశాల నాయకులు హాజరుకానున్నారు. భారత ప్రధాని గైర్హాజరు నేపథ్యంలో మోదీ, ట్రంప్‌ల భేటీ కూడా జరగదు. ఈ ఆసియాన్‌లో మలేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం, మయన్మార్ వంటి 10 దేశాలు సభ్యదేశాలుగా ఉన్నాయి. గత కొన్నేళ్లుగా భారత్- ఆసియాన్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు గణనీయంగా పెరిగాయి. వాణిజ్యం, పెట్టుబడి రంగాలతో పాటు భద్రత, రక్షణల్లో సహకారంపై దృష్టి సారించాయి.




## చెన్నైలో అమెరికా కాన్సులేట్ పునఃప్రారంభం

**చెన్నై :** తమిళనాడులోని చెన్నైలో అమెరికా కాన్సులేట్ తన కార్యకలాపాలను పునఃప్రారంభించింది. ఈ విషయాన్ని కాన్సులేట్ ఎక్స్‌లో పోస్టు ద్వారా వెల్లడించింది. వీసా ప్రాసెసింగ్ సేవలు గురువారం నుంచి ప్రారంభం అయ్యాయని పేర్కొంది. ఈ రోజు అపాయింట్‌మెంట్ ఉన్న దరఖాస్తుదారులు మాత్రమే రావాలని సూచించింది. అక్టోబరు 22న కాన్సులేట్ మూసివేత కారణంగా రద్దయిన అపాయింట్‌మెంట్‌లను రీషెడ్యూల్ చేస్తామని తెలిపింది. ప్రతి దరఖాస్తుదారునికి రీషెడ్యూల్‌కు సంబంధించిన వివరాలను తెలియజేస్తామని వెల్లడించింది.

## హెచ్-1బీ వీసాపై లక్ష డాలర్ల ఫీజు తొలగించండి

### అమెరికా చట్టసభ సభ్యుల లేఖ




**యూఎస్ :** హెచ్-1బీ వీసా ఫీజు లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై సొంత దేశంలోనే వ్యతిరేకత వ్యక్తమవుతుంది. తాజాగా ఈ ఫీజు నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలంటూ అమెరికా చట్టసభ సభ్యులు ట్రంప్, వాణిజ్య మంత్రి లుట్నిక్‌కు లేఖ రాశారు. డెమొక్రట్లు, రిపబ్లికన్ పార్టీలకు చెందిన ఏడుగురు చట్టసభ సభ్యులు ఈ లేఖ రాశారు. హెచ్-1బీ వీసా ఫీజును పెంచడం వల్ల ఆ వీసా దుర్వినియోగం ఏమాత్రం ఆగదని ఆందోళన వ్యక్తంచేశారు. దీనికి బదులుగా అమెరికాలోని స్టార్టప్ కంపెనీలపై తీవ్ర ప్రభావం పడుతోందని, ఆవిష్కరణలు తగ్గిపోతాయని పేర్కొన్నారు. దీని కారణంగా భారత్‌తో సహా అనేక దేశాల నుంచి వచ్చిన నైపుణ్యం కలిగిన వ్యక్తులను కోల్పోవాల్సి ఉంటుందన్నారు. హెచ్-1బీ వీసా దుర్వినియోగం కాకుండా మార్పులు అవసరమని తాము కూడా భావిస్తున్నట్లు చెప్పారు. అయితే, ఫీజు పెంచడం అనేది సరైన చర్య కాదన్నారు. ఇది ప్రతికూలమైన ప్రభావాన్ని చూపుతుందన్నారు. పెద్ద కంపెనీలు ఈ మొత్తాన్ని భరించగలిగినప్పటికీ.. చిన్న కంపెనీలు ఆ వీసా అభ్యర్థుల నియామకాలను నిలిపివేసుకోవాల్సి వస్తోందన్నారు. ఇదే క్రమంలో ప్రాజెక్టులు కూడా విదేశాలకు తరలిపోతాయన్నారు. అధిక నైపుణ్యం కలిగిన వలసదారులు చరిత్రాత్మకంగా అమెరికాకు బలమని వ్యాఖ్యానించారు. అమెరికన్ల స్థానంలో తక్కువ జీతంతో విదేశీయులను నియమించుకునే అవుట్‌సోర్సింగ్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. అధిక నైపుణ్యం కలిగిన వలసదారులు మన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో సహా అమెరికా పౌరులకు అవకాశాలను విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వ్యవస్థను ఆధునికీకరించేందుకు అధ్యక్షుడు ట్రంప్ కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలని అభ్యర్థించారు. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ చేసిన ప్రకటన ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే, హెచ్-1బీ వీసాపై విధించిన లక్ష డాలర్ల రుసుము వార్షిక ఫీజు కాదని, దరఖాస్తు చేసుకొనే సమయంలో కట్టాల్సిన వన్‌టైమ్ ఫీజు అని వైట్‌హౌస్ ఆ తర్వాత స్పష్టతనిచ్చింది. ఇక, వీసా ఫీజు పెంపుపై అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నేపథ్యంలో.. ట్రంప్ సర్కారు మార్గదర్శకాలు జారీ చేసింది. దాని ప్రకారం.. విదేశాల నుంచి నేరుగా హెచ్1బీ వీసాలకు దరఖాస్తు చేసుకునేవారు మాత్రమే లక్ష డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది.



## అమెరికాలో రోడ్డు ప్రమాదం..

### భారతీయుడి అరెస్టు

**యూఎస్ :** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భారతీయుడు అరెస్టయ్యాడు. కాలిఫోర్నియాలో జరిగిన ఘటనలో ముగ్గురు మృతికి కారణమయ్యాడని పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా అగ్రరాజ్యంలోకి ప్రవేశించిన అతడి పేరు జషన్‌ప్రీత్ సింగ్ అని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. 21 ఏళ్ల సింగ్ ప్రమాద సమయంలో మాదకద్రవ్యాల మత్తులో జోగుతున్నాడని పేర్కొన్నాయి. 2022లో సింగ్ అమెరికాలోకి ప్రవేశించాడు. అప్పుడు కాలిఫోర్నియాలోని బోర్డర్ పెట్రోల్ ఏజెంట్లు అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ పెండింగ్‌లో ఉండటంతో అతడిని విడుదల చేశారు. అతడి వద్ద చట్టబద్ధమైన ప్రతాలు లేవని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ తాజాగా ధ్రువీకరించింది. కాలిఫోర్నియా ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. "ఆ ఘటనలో సింగ్ కూడా గాయపడ్డాడు. ట్రక్ నడుపుతోన్న సమయంలో అతడు డ్రగ్స్ మత్తులో ఉన్నాడని వైద్యులు వెల్లడించారు" అని హైవే పెట్రోలింగ్ అధికారి వెల్లడించారు. ట్రాఫిక్‌లో కూడా బ్రేక్స్ వేయలేదని ట్రక్ డ్యాష్‌క్యామ్ రికార్డింగ్‌ను బట్టి తెలుస్తోంది. ఇదిలాఉంటే.. ఆగస్టులోనూ ఇదే తరహా ఘటన జరిగింది. ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. 2018లో అక్రమంగా అగ్రదేశంలోకి ప్రవేశించిన హర్జిందర్ సింగ్ ఆ ఘటనకు కారకుడని తేలింది.

## వికాసానికి, వినాశనానికి మధ్య పోరు : జేపీ నడ్డా



**బిహార్ :** బిహార్ ఎన్నికలను ఎన్డీయే 'వికాసానికి', ఇండియా కూటమి 'వినాశనానికి' మధ్య జరుగుతున్న పోరుగా భాజపా అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. భాగస్వామ్య పక్షాలను అంతం చేసే పరాన్నజీవి పార్టీగా కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. లాలూ ప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని ఆర్జేడీ.. రంగ్‌దారీ (దోపిడీ), జంగల్‌రాజ్ (ఆటవిక పాలన), దాదాగిరీ (దౌర్జన్యం)లకు ప్రతీక అని విమర్శించారు. బిహార్‌లోని ఔరంగాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. తాను పట్నాలోనే పుట్టానని, బిహార్‌లోనే 20 ఏళ్లు గడిపానని.. ఆర్జేడీ చీకటి యుగం గురించి తనకు తెలుసని కేంద్ర మంత్రి నడ్డా పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పిస్తామని, వలసలను అడ్డుకుంటామని తేజస్వీ యాదవ్ ఇచ్చిన హామీలు.. 'భూమికి ఉద్యోగం కుంభకోణం'లో ఆర్జేడీ ప్రమేయాన్ని గుర్తుచేస్తున్నా యన్నారు. మాజీ గ్యాంగ్‌స్టర్ షహాబుద్దీన్ తనయుడు ఒసామాకు రఘునాథ్‌పూర్ నుంచి టికెట్ ఇవ్వడంపై మండిపడ్డారు. బిహార్ విషయంలో ఆ పార్టీకి ఎంత శ్రద్ధ ఉందో ఇది తేటతెల్లం చేస్తోందన్నారు.

### ఆర్జేడీవి తప్పుడు వాగ్దానాలు : రవిశంకర్ ప్రసాద్

తేజస్వీ యాదవ్ ఆచరణలో సాధ్యం కాని హామీలు ఇస్తున్నారని భాజపా ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. "2.6 కోట్ల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని తేజస్వీ చెబుతున్నారు. దీనికి రూ.12 లక్షల కోట్లు అవసరం అవుతాయి. రాష్ట్ర మొత్తం బడ్జెట్ దాదాపు రూ.3 లక్షల కోట్లు. మరి ఎక్కడి నుంచి ఉద్యోగాలు కల్పిస్తారు?" అని ఓ మీడియా సమావేశంలో ప్రశ్నించారు. ఓటర్లకు ఆర్జేడీ తప్పుడు వాగ్దానాలు ఇస్తోందని, ఆ పార్టీని రాష్ట్ర ప్రజలు విశ్వసించరని చెప్పారు.



## స్నేహం అంటే అత్యాచారానికి లైసెన్స్ కాదు..

**న్యూఢిల్లీ :** పోక్సో కేసు విచారణలో భాగంగా దిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. స్నేహం అంటే అత్యాచారం చేయడానికి లైసెన్స్ కాదని పేర్కొంది. తామిద్దరం స్నేహితులమని పేర్కొంటూ.. నిందితుడు ముందస్తు బెయిల్ కోరిన నేపథ్యంలో కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. మైనర్ అయిన బాధితురాలు చేసిన ఫిర్యాదు ప్రకారం.. కొన్నేళ్లుగా నిందితుడితో ఆమెకు పరిచయం ఉంది. ఆమెను అతడు తన స్నేహితుడి ఇంట్లో బంధించి, కొట్టి, లైంగికంగా వేధించాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించాడు. అయితే తామిద్దరం ఇష్టపూర్వకంగా ఆ బంధాన్ని కొనసాగించామని, ఎఫ్ఐఆర్ నమోదులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని నిందితుడు కోర్టును ఆశ్రయించాడు. దీనిపై తాజాగా విచారణ జరిగింది. జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ఈ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించారు. గతంలోనూ నాలుగుసార్లు ఈ అభ్యర్థనను కోర్టు తిరస్కరించినప్పటికీ.. అతడు విచారణలో భాగం కాకపోవడాన్ని ప్రశ్నించారు. "బాధితురాలు, నిందితుడు స్నేహితులే అయినప్పటికీ.. బాధితురాలిపై పదేపదే అత్యాచారం చేయడానికి, స్నేహితుడి ఇంట్లో బంధించేందుకు, కనికరం లేకుండా కొట్టేందుకు స్నేహం ఎలాంటి లైసెన్స్ ఇవ్వదు" అని కోర్టు వ్యాఖ్యానించింది. ఎఫ్ఐఆర్ నమోదు అలస్యమైందంటూ నిందితుడు చేసిన వ్యాఖ్యను తోసిపుచ్చింది. "భయం, తన మనసుకు తగిలిన గాయం కారణంగా ఈ ఘటన గురించి తల్లిదండ్రులకు చెప్పడానికి బాధితురాలు సంకోచించడం సహజమే" అని వ్యాఖ్యానించింది. ఈ ఆరోపణల తీవ్రత దృష్ట్యా బెయిల్ అభ్యర్థనను తిరస్కరిస్తున్నట్లు పేర్కొంది.

## ట్రంప్ నుంచి తప్పించుకునేందుకే సదస్సుకు మోదీ దూరం: కాంగ్రెస్ విమర్శలు



**న్యూఢిల్లీ :** మలేసియాలో జరగనున్న ఆసియాన్ సమ్మిట్‌కు ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకావడం లేదనే సంగతి తెలిసిందే. దీంతో మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి తప్పించుకునేందుకే ఆయన ఈ సమావేశానికి వెళ్లడం లేదంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'చాలా రోజులుగా ఈ సదస్సు గురించి ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నాయి. మోదీ దీనికోసం కౌలాలంపూర్ వెళ్తారా? లేదా? అని. ఇప్పుడు వెళ్లడం లేదని తేలిపోయింది. అంటే ప్రపంచ నాయకులను ఆలింగనం చేసుకొని ఫొటో తీసుకోవడంతో పాటు తనని తాను విశ్వగురువుగా చాటుకొనే అవకాశం కోల్పోయారు. మోదీ ఈ సదస్సుకు వెళ్లకపోవడానికి కారణం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా అక్కడ ఉండటమే. కొన్ని వారాల క్రితం ఈజిప్టులో జరిగిన గాజా శాంతి సమావేశానికి కూడా మన ప్రధాని హాజరుకాలేదు. ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించిన కారణంగా.. ఆయనపై ప్రశంసలు కురిపిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. కానీ, ట్రంప్ ఆపరేషన్ సిందూర్‌ను తానే ఆపానని 53 సార్లు.. రష్యా చమురును భారత్ కొనుగోలు నిలిపివేసిందని ఐదుసార్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ట్రంప్‌తో కలవకుండా మోదీ జాగ్రత్త పడుతున్నారు' అని విమర్శించారు. మలేసియాలో ఈనెల 26 నుంచి 28 వరకు ఆసియాన్ సదస్సు జరగనుంది. దీనికి ట్రంప్‌తో సహా ప్రపంచ నాయకులు హాజరుకానున్నారు. ఇందులో మోదీ వర్చువల్‌గా పాల్గొననున్నారు. విదేశాంగ మంత్రి జై శంకర్ అక్కడ భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.

# స్వల్ప లాభాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. త్రైమాసిక ఫలితాలు, విదేశీ మదుపర్ల కొనుగోళ్లు, పండగ వేళ వ్యాపారంతో సూచీలు ఈ ఉదయం ఉవ్వెత్తున ఎగిశాయి. ఈ క్రమంలో చాలా రోజుల తర్వాత నిఫ్టీ మళ్లీ 26వేల మార్కు దాటింది. యూఎస్ ఫ్యూచర్ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాల నేపథ్యంలో మదుపర్లు గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణకు దిగారు. దీంతో సూచీలు మోస్తరు లాభాలకు పరిమితమ య్యాయి. సెన్సెక్స్ ఉదయం 85,154.15 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,426.34) భారీ లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 85,290.06 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 130.06 పాయింట్ల లాభంతో 84,556.40 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 22.80 పాయింట్ల లాభంతో 25,891.40 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.86గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు రాణించాయి. ఎటర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. రష్యన్ చమురు సంస్థలపై అమెరికా ఆంక్షల వేళ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర మళ్లీ 65 డాలర్లపైన కొనసాగుతోంది. బంగారం 4109 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.









## రెండో వన్డేలోనూ భారత్ ఓటమి

### సిరీస్‌ను కైవసం చేసుకున్న ఆస్ట్రేలియా

**అడిలైడ్:** ఆస్ట్రేలియాతో జరిగిన రెండో వన్డేలో భారత్ ఓటమిపాలైంది. టీమ్‌ఇండియాపై ఆసీస్ రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య జట్టు 2-0తో మరో మ్యాచ్ మిగిలుండగానే కైవసం చేసుకుంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 9 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. ఈ టార్గెట్‌ని కంగారూలు 46.2 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి ఛేదించారు. వన్‌డౌన్ బ్యాటర్ మాథ్యూ షార్ట్ (74, 78 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), కూపర్ కనోలి (61, 53 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీలు సాధించారు. మిచెల్ ఓవెన్ (36, 23 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. మాట్ రెన్‌షా (30), ట్రావిస్ హెడ్ (28), మిచెల్ మార్ష్ (11) పరుగులు చేశారు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. అక్షర్ పటేల్, సిరాజ్ తలో వికెట్ తీశారు. సిరీస్‌లో నామమాత్రపు మూడో వన్డే శనివారం (అక్టోబర్ 25) సిడ్నీలో జరగనుంది. భారత బ్యాటర్లలో రోహిత్ శర్మ (73బీ 97 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), శ్రేయస్ అయ్యర్ (61, 77 బంతుల్లో 7 ఫోర్లు) అర్ధ శతకాలు చేయగా.. అక్షర్ పటేల్ (44, 41 బంతుల్లో 5 ఫోర్లు) రాణించాడు. శుభ్‌మన్ గిల్ (9), కేఎల్ రాహుల్ (11) విఫలం కాగా.. విరాట్ కోహ్లీ వరుసగా రెండో మ్యాచ్‌లో డకౌట్ అయి తీవ్ర నిరాశపర్చాడు. వాషింగ్టన్ సుందర్ (12), నితీశ్ రెడ్డి (8) రాణించలేకపోయారు. గిల్, కోహ్లీ ఒకే ఓవర్లో ఔటవడంతో భారత్ 17 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో రోహిత్, శ్రేయస్ మూడో వికెట్‌కు 118 పరుగుల భాగస్వామ్యం (136 బంతుల్లో) నెలకొల్పి జట్టును ఆదుకున్నారు. చివర్లో టెయిలెండర్లు హర్షిత్ రాణా (24బి), అర్ష్‌దీప్ సింగ్ (13) మెరవడంతో భారత్ 250కిపైగా స్కోరు చేసింది.



## వరుసగా రెండు డకౌట్‌లు..

### ఆటకు విరాట్ గుడ్‌బై చెబుతాడా?

భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ మరోసారి నిరాశ పరిచాడు. కనీసం పరుగుల ఖాతా కూడా తెరలేకపోవడం గమనార్హం. దాదాపు ఏడు నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన విరాట్‌పై భారీ అంచనాలే ఉన్నాయి. కానీ, వాటిని అందుకోవడంలో విఫలమయ్యాడు. ఆసీస్‌తో పెర్త్ వన్డేలో 8 బంతులు ఆడిన కోహ్లీ పరుగుల ఖాతా తెరవలేదు. ఇప్పుడు తనకు కలిసొచ్చే అడిలైడ్‌లోనూ ఇబ్బంది పడ్డాడు. ఈసారి నాలుగు బంతుల్లోనే వికెట్ల ముందు దొరికిపోయాడు. దీంతో భారత అభిమానులు తీవ్రస్థాయిలో నిరుత్సాహానికి గురయ్యారు. అయితే, కోహ్లీ తన వన్డే కెరీర్‌లో ఇలా వరుసగా రెండు మ్యాచుల్లో డకౌట్ కావడం ఇదే తొలిసారి. ఇప్పుడు ఆ చెత్త రికార్డును ఖాతాలో వేసుకున్నాడు.

#### ఈ సిరీస్‌లో ఔట్ అయ్యిందిలా..

పెర్త్ వేదికగా భారత్ - ఆస్ట్రేలియా మధ్య తొలి వన్డే జరిగింది. వర్షం పలుమార్లు అంతరాయం కలిగించినా చివరికి ఆసీస్‌నే విజయం వరించింది. ఆ మ్యాచ్‌లో విరాట్ ఆఫ్‌సైడ్ బంతిని కదిలించి వికెట్ ఇచ్చాడు. మిచెల్ స్టార్క్ సంధించిన బంతిని ఆడబోయి బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో ఫీల్డర్‌కు చిక్కాడు. ఇప్పుడు అడిలైడ్‌లోనూ రాణిస్తాడనుకుంటే ఇక్కడా బ్యాట్ ఎత్తేశాడు. ఈసారి బార్ట్‌లెట్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. కనీసం డీఆర్ఎస్ కూడా తీసుకోకపోవడం గమనార్హం. పెవిలియన్‌కు వెళ్తూ అభిమానులకు అభివాదం చేయడంతో కొత్త చర్చ మొదలైంది. ఈ సిరీస్ అనంతరం వన్డేలకూ వీడ్కోలు చెబుతాడా? అనే సందేహం అభిమానుల్లో నెలకొంది. ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారిపోయింది.

# సెమీస్‌లోకి టీమిండియా






- శతకాలతో చెలరేగిన స్మృతి, ప్రతీక
- మెరిసిన జెమీమా, రేణుక, క్రాంతి
- న్యూజిలాండ్‌పై భారత్ ఘనవిజయం

**ముంబయి :** మహిళల వన్డే ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ ఓటముల తర్వాత భారత జట్టు గెలుపు బాట పట్టింది. గురువారం 53 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించి సెమీస్‌లో అడుగు పెట్టింది. వర్షం వల్ల డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఫలితం తేలిన మ్యాచ్‌లో 44 ఓవర్లలో 325 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కివీస్ 8 వికెట్లకు 271 పరుగులే చేయగలిగింది. ఆ జట్టులో బ్రూక్ హాలిడే (81), ఇసబెల్లా గేజ్ (65 నాటౌట్), అమేలియా కెర్ (45) పోరాడారు. భారత బౌలర్లలో రేణుక సింగ్ (2/25), క్రాంతి గౌడ్ (2/48), ప్రతీక రావల్ (1/19) రాణించారు. మొదట ఓపెనర్లు ప్రతీక రావల్ (122), స్మృతి మంధాన (109) శతకాలకు జెమీమా రోడ్రిగ్స్ (76 నాటౌట్) మెరుపులు తోడవడంతో భారత్ నిర్ణీత 49 ఓవర్లలో 3 వికెట్లకు 340 పరుగుల భారీ స్కోరు సాధించింది.

#### ఆ ముగ్గురూ నిలిచినా..:

ఛేదనలో కివీస్ ఎంతో మెరుగ్గా బ్యాటింగ్ చేసినప్పటికీ.. సాధించాల్సిన లక్ష్యం మరీ పెద్దది కావడంతో ఆ జట్టు ఏ దశలోనూ గెలుపు రేసులో లేదు. ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే క్రాంతి.. సుజీ బేట్స్ (1)ను ఔట్ చేయడంతో కివీస్ ఛేదన పేలవంగా ఆరంభమైంది. అయితే జార్జియా ప్లిమ్మర్ (30), అమేలియా నిలకడగా ఆడి జట్టును పోటీలో నిలిపే ప్రయత్నం చేశారు. కానీ ప్లిమ్మర్, కెప్టెన్ సోఫీ డివైన్ (6) స్వల్ప వ్యవధిలో ఔటైపోవడంతో కివీస్‌కు కష్టమే అని తేలిపోయింది. సూపర్ ఫామ్‌లో ఉన్న బ్రూక్ హాలిడే.. అమేలియా, ఇసబెల్లా గేజ్‌లతో భాగస్వామ్యాలు నెలకొల్పింది. కానీ వీరి పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించడానికే ఉపయోగపడింది.

ముందు ఓపెనర్లు.. తర్వాత జెమీమా: మొదట టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న కివీస్.. ఆ నిర్ణయానికి ఎంతో చింతించేలా సాగింది భారత ఇన్నింగ్స్. ఈ ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో మినహా జట్టుకు ఆశించిన ఆరంభాన్నివ్వలేకపోయిన స్మృతి, ప్రతీక.. లెక్కలన్నీ సరి చేసేలా అద్భుత భాగస్వామ్యంతో జట్టుకు బలమైన పునాది వేశారు. స్మృతి తనదైన శైలిలో చెలరేగిపోతే.. ప్రతీక సంయమనంతో ఆడుతూ, అవకాశం చిక్కినపుడల్లా షాట్లు ఆడింది. ఇటు వికెట్ పడక, అటు పరుగులు ఆగక కివీస్ దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. స్మృతి 49 బంతుల్లోనే అర్ధశతకం సాధించగా.. ప్రతీక 75 బంతుల్లో ఈ మార్కును చేరుకుంది. 18వ ఓవర్లో వంద దాటిన భారత్.. 33వ ఓవర్‌కే 200 మార్కును చేరుకుంది. ఈలోపే స్మృతి 88 బంతుల్లోనే శతకాన్నందుకుంది. అందులో 10 ఫోర్లు, 3 సిక్సర్లు ఉన్నాయి. మరోవైపు ప్రతీక కూడా సెంచరీ వైపు అడుగులు వేసింది. పార్ట్ టైం స్పిన్నర్ సుజీ బేట్స్ కివీస్ నిరీక్షణకు తెరదించింది. ఓ భారీ షాట్‌కు ప్రయత్నించిన స్మృతి బౌండరీ వద్ద హన్నా రోవ్‌కు క్యాచ్ ఇచ్చింది. తర్వాత ప్రతీక.. జెమీమాతో కలిసి స్కోరు బోర్డును ముందుకు నడిపించింది. కాసేపటికే ఆమె మూడంకెల స్కోరును (122 బంతుల్లో) అందుకుంది. ఆ తర్వాత ప్రతీక ఔటైనా.. అప్పటికే క్రీజులో కుదురుకున్న జెమీమా.. ఆఖరి ఓవర్లలో చెలరేగి ఆడింది. హర్మన్‌ప్రీత్ (10) మరోసారి నిరాశపరిచినా.. జెమీమా మెరుపులతో భారత్ భారీ స్కోరు సాధించింది.

#### సెమీస్‌కు ఇలా..?

న్యూజిలాండ్‌పై ఘనవిజయంతో భారత్‌కు సెమీస్ బెర్తు ఖాయమైపోయింది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మొదలయ్యే తన చివరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్‌సేన.. బంగ్లాదేశ్‌ను ఢీకొంటుంది. అదే రోజు ఉదయం 11 నుంచి ఇంగ్లాండ్‌తో కివీస్ తలపడుతుంది. ఆ మ్యాచ్‌ల ఫలితాలతో సంబంధం లేకుండా భారత్ ముందంజ వేసింది. ఆ రోజు బంగ్లా చేతిలో భారత్ ఓడి, ఇంగ్లాండ్‌పై కివీస్ గెలిస్తే ఇరు జట్ల పాయింట్లు సమమవుతాయి. ఒకవేళ నెట్ రన్‌రేట్‌లో భారత్‌ను అధిగమించినా కివీస్ ముందంజ వేయదు. అందుక్కారణం.. భారత్ ఖాతాలో ఎక్కువ విజయాలుండడమే. కివీస్ వర్షం వల్ల రద్దయిన రెండు మ్యాచ్‌ల ద్వారా 2 పాయింట్లు సాధించింది. కాబట్టి ఇంగ్లాండ్‌ను ఓడించి పాయింట్లలో భారత్‌ను సమం చేసినా, విజయాల్లో వెనుకబడడం వల్ల ఆ జట్టు సెమీస్ చేరలేదు. అయితే టాప్-3లో ఉన్న మూడు జట్లూ ఇప్పటికే 9 అంతకంటే ఎక్కువ పాయింట్లతో ఉన్నాయి కాబట్టి.. భారత్ తన చివరి మ్యాచ్‌లో నెగ్గినా 8 పాయింట్లే సాధిస్తుంది. కాబట్టి నాలుగో స్థానంతోనే సెమీస్ చేరుతుంది. అగ్రస్థానంలో నిలిచే జట్టుతో సెమీస్ ఆడుతుంది.


# విమానాల్లో పవర్ బ్యాంక్‌లపై నిషేధం?

దేశీయ విమాన ప్రయాణాల్లో పవర్‌బ్యాంక్‌ల వాడకంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. విమాన ప్రయాణాల్లో వీటి వాడకాన్ని పూర్తిగా నిషేధించడం లేదా వాడకంపై కఠిన నిబంధనలు అమలు చేయడం వంటి అంశాలను పరిశీలిస్తోంది. ఇటీవల ఢిల్లీ విమానాశ్రయంలో జరిగిన ఇండిగో విమాన అగ్ని ప్రమాద ఘటన నేపథ్యంలో ఈ సమగ్ర సమీక్ష చేపట్టింది. ఇటీవల ఢిల్లీ నుంచి దిమాపూర్‌కు బయలుదేరిన ఇండిగో విమానంలో ఓ ప్రయాణికుడి పవర్ బ్యాంక్ పేలడంతో మంటలు చెలరేగాయి. సిబ్బంది వెంటనే అప్రమత్తమవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని ఇండిగో తెలిపింది. ప్రయాణికుడి వద్ద ఉన్న ఎలక్ట్రిక్ పరికరం పేలడం వల్లే విమానంలో మంటలు చెలరేగాయని, తర్వాత విమానాన్ని భద్రతా తనిఖీలు పూర్తి చేసి సాధారణ కార్యకలాపాలకు అనుమతించామని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఎయిర్‌లైన్స్ పవర్ బ్యాంకును ఎలా వాడుతున్నారనే అంశంపై డీజీసీఏ దృష్టిసారించింది. ఇందులో భాగంగా విమానంలో పవర్ బ్యాంక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించడం లేదా వాటి సామర్థ్యంపై పరిమితులు విధించడం లేదా కేవలం భద్రతా ప్రమాణాలు పాటించని పవర్ బ్యాంకులను మాత్రమే నిషేధించడం వంటి అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై పౌర విమానయాన మంత్రిత్వశాఖ, డీజీసీఏతో కలిసి కొత్త మార్గదర్శకాలు రూపొందించే ప్రయత్నంలో ఉంది.

ఇక అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్ ఇప్పటికే కఠిన నిబంధనలు అమలు చేస్తున్నాయి. ఇటీవల ఎమిరేట్స్ విమానాల్లో పవర్



బ్యాంకుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించింది. ప్రయాణికులు 100 వాట్-అవర్‌ల కంటే తక్కువ సామర్థ్యం గల పవర్ బ్యాంకులు మాత్రమే తీసుకెళ్లవచ్చు. వాటిని విమాన ప్రయాణ సమయంలో ఛార్జ్ చేయడం, పరికరాలకు కనెక్ట్ చేయడాన్ని కఠినంగా నిషేధించింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్ కూడా ఏప్రిల్‌లో ఇలాంటి నిబంధనలు అమలు చేసింది. కేథే పసిఫిక్, ఖతార్ ఎయిర్‌వేస్ వంటి సంస్థలు కూడా పవర్ బ్యాంకులు ఎక్కడ ఉంచాలనే దానిపై కఠిన మార్గదర్శకాలు జారీ చేశాయి. పవర్ బ్యాంకుల్లో లిథియం-అయాన్ బ్యాటరీలు ఉండటం వల్ల అవి అధిక శక్తిని నిల్వ ఉంచగలవు. కానీ తక్కువ నాణ్యత గల చవక మోడళ్లు భద్రతా ప్రమాణాలు లేకుండా తయారు చేయడం వల్ల కొన్నిసార్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి.



## నవంబర్ 1 నుంచి బ్యాంకు ఖాతాకు నలుగురు నామినీలు

**ఢిల్లీ:** బ్యాంకు ఖాతాలకు సంబంధించి కీలక మార్పు నవంబర్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఖాతాదారులు ఇకపై తమ ఖాతాకు నలుగురేసి నామినీలను నియమించుకోవచ్చు. దీనికి సంబంధించి బ్యాంకింగ్ చట్టాల సవరణ చట్టం, 2025లో మార్పులు చేసిన సంగతి తెలిసిందే. నామినేషన్‌కు సంబంధించిన కీలక నిబంధనలు నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. తన మరణానంతరం అకౌంట్లో ఉన్న డబ్బును బ్యాంక్ ఎవరికి చెల్లించాలన్న విషయాన్ని వినియోగదారుడి ఖాతా తెరిచే సమయంలోనే తెలియజెప్పాలి. ప్రస్తుతం ఒకరినే బ్యాంక్ ఖాతాకు నామినీగా నియమించే వీలుంది. ఇకపై నలుగురిని నామినీలుగా పెట్టుకునేలా చట్ట సవరణ చేశారు. నామినీలను ఒకేసారి గానీ, ప్రాధాన్యతల ఆధారంగా ఒకరి తర్వాత ఒకరికి చెందేలా ఏర్పాటు చేసుకోవచ్చు. నూరు శాతంలో ఎవరికి ఎంత చెందాలో పేర్కొనడం ఒక పద్ధతి. నామినీలుగా పేర్కొన్న వ్యక్తుల్లో మొదటి వ్యక్తి మరణిస్తే రెండో వ్యక్తికి, రెండో వ్యక్తి మరణిస్తే మూడో వ్యక్తికి.. ఇలా సొమ్ము చేరేలా ఏర్పాటు చేసుకోవడం రెండోది. లాకర్లకూ ఇదే నిబంధన వర్తిస్తుంది. బ్యాంకింగ్ చట్టాల సవరణ చట్టాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 15న నోటిఫై చేశారు. ఇందులో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాక్ట్, 1934బీ బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్, 1949బీ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాక్ట్, 1955బీ బ్యాంకింగ్ కంపెనీస్ యాక్ట్, 1970, 1980కి సంబంధించి మొత్తం 19 సవరణల కోసం ఈ సవరణ చట్టం తీసుకొచ్చారు. దీనికి సంబంధించి జులైన 29 గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా.. దీంట్లోని కొన్ని ప్రొవిజన్లు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చాయి. నామినేషన్‌కు సంబంధించిన నిబంధనలు నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

## హెచ్‌యూఎల్ రూ.19 మధ్యంతర డివిడెండ్

Hindustan Unilever Limited

**ఢిల్లీ:** ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించిం ది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో 3.8 శాతం వృద్ధితో రూ.2,694 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే సమయంలో రూ.2,595 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ ఆదాయం సైతం 2.1 శాతం వృద్ధితో రూ.16,034 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే సమయంలో ఆదాయం రూ.15,703 కోట్లుగా ఉంది. కంపెనీ మొత్తం ఖర్చులు 3.32 శాతం పెరిగి రూ.12,999 కోట్లకు చేరినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఇతర ఆదాయాలతో కలుపుకొంటే మొత్తం ఆదాయం రూ.16,388 కోట్లుగా ఉందని పేర్కొంది. కేంద్రం తీసుకొచ్చిన తాజా జీఎస్టీ సంస్కరణలు వినియోగాన్ని పెంచుతాయని, తాత్కాలిక ప్రభావం ఈ త్రైమాసికంలో కనిపించిందని హెచ్‌యూఎల్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ ప్రియానాయర్ పేర్కొన్నారు. త్రైమాసిక ఫలితాల సందర్భంగా కంపెనీ మధ్యంతర డివిడెండ్‌ను కూడా ప్రకటించింది. ఒక్కో షేరుకు రూ.19 చొప్పున ఈ డివిడెండ్‌ను చెల్లించేందుకు బోర్డు అంగీకరించింది. ఇందుకు నవంబర్ 7ను రికార్డు డేట్‌గా ప్రకటించింది. నవంబర్ 20న చెల్లింపులు చేయనున్నట్లు పేర్కొంది. డివిడెండ్ కింద మొత్తంగా 11 లక్షల మంది వాటాదారులకు రూ.4,464 కోట్లు చెల్లింపులు చేయనుంది. త్రైమాసిక ఫలితాల వేళ బీఎస్ఈలో హెచ్‌యూఎల్ కంపెనీ షేర్లు 1.20 శాతం లాభంతో 2,623 వద్ద ట్రేడవుతున్నాయి.



## కీలక మార్పుల దశలో మైక్రోసాఫ్ట్

### కంపెనీ సీఈవో సత్య నాదెళ్ల

ప్రపంచం కృత్రిమ మేధస్సుకు అనుగుణంగా మారుతున్న నేపథ్యంలో టెక్నాలజీలో తమ కంపెనీ కీలక పాత్ర పోషిస్తోందని ప్రముఖ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల పేర్కొన్నారు. కంపెనీ ఉద్యోగులకు ఆయన ఓ లేఖ రాశారు. అందులో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. సంస్థ స్థాపించి 50 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ టెక్నాలజీలో దూసుకుపోతుందన్నారు. కొత్త తరం ఆవిష్కరణల్లో తాము ముందుకుసాగుతున్నామని.. ఇప్పుడు దీన్ని మరింత వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమతుల్యతను సాధించడం కష్టతరమైన పని అని, ఏళ్ల పాటుగా కొన్ని కంపెనీలు మాత్రమే దీన్ని చేయగలిగాయన్నారు. విజయం సాధించాలంటే దశాబ్దాల పాటు ఆలోచిస్తూనే ఉండాలన్నారు. భవిష్యత్తుపై దృష్టిసారించాలని, నిరంతరం మనల్ని మనం మెరుగుపరుచుకునేలా ఉత్సుకతను నింపుకోవాలన్నారు. ఈ సందర్భంగా లక్ష్యాలను సాధించే క్రమంలో భద్రత, నాణ్యత, ఏఐ ఆవిష్కరణ వంటివి తమ ప్రాధాన్యమన్నారు. తమ కంపెనీ సేవలు ప్రపంచానికి కీలకమైనవని వ్యాఖ్యానించారు. ఏఐ మౌలిక సదుపాయాల రంగంలో అగ్రగామిగా కొనసాగుతున్నామన్నారు. అనేక దేశాల్లో కొత్త డేటా సెంటర్లను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం 70 ప్రాంతాల్లో 400 కంటే ఎక్కువ డేటా సెంటర్లను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గత నెలలో విస్కాన్సిన్‌లో ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన ఏఐ డేటా సెంటర్‌ను ప్రకటించామన్నారు. మన చుట్టూ ఉన్న ప్రపంచం బాగుంటే.. మనం కూడా బాగుంటామనే దాన్ని మైక్రోసాఫ్ట్ విశ్వసిస్తోందన్నారు. భూమి మీద ఉన్న ప్రతిఒక్కరికీ ప్రయోజనం చేకూర్చే సాంకేతికతను సృష్టించాలని నిబద్ధతతో కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు విశ్వాసం కలిగిన సాంకేతికతను కోరుకుంటున్నారని వివరించారు. అందుకే బాధ్యతాయుతమైన ఏఐ ఆవిష్కరణలను, సురక్షిత సాంకేతికతను నిర్మించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ఇక, ఉద్యోగాలు సృష్టించేందుకు, ఆర్థిక అవకాశాలను ప్రోత్సహించడంతో సహా ప్రపంచవ్యాప్తంగా సైబర్ భద్రత, డిజిటల్ స్థిరత్వం బలోపేతానికి అంకితభావంతో ఉన్నామన్నారు.

# రాజాసాబ్‌కు గ్రాండ్ వెల్‌కల్



టాలీవుడ్ దర్శకుడు మారుతి-గ్లోబల్ స్టార్ ప్రభాస్ కాంబోలో వస్తోన్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ రాజాసాబ్. హార్రర్ కామెడీ జోనర్‌లో పాన్ ఇండియా బ్యాక్‌డ్రాప్‌లో వస్తోన్న ఈ చిత్రంలో మాళవిక మోహనన్, ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్, రిద్ధికుమార్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ప్రభాస్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ రాజాసాబ్ స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. కారు రూఫ్‌టాప్‌పై స్టైలిష్‌గా కూర్చున్న రాజాసాబ్‌కు గ్రాండ్ వెల్ కమ్ చెబుతున్న స్టిల్ ఇప్పుడు అభిమానుల్లో జోష్ నింపుతోంది. ఇప్పటికే రాజాసాబ్ ట్రైలర్‌ను లాంచ్ చేయగా.. కామెడీ, లవ్, రొమాన్స్, హార్రర్ లాంటి ఎలిమెంట్స్‌తో మారుతి మార్క్ కామెడీ టచ్‌తో సినిమా ఉండబోతున్నట్టు క్లారిటీ ఇచ్చేస్తుంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా 2026 జనవరి 9న విడుదల చేయనున్నారు. మేకర్స్ చాలా రోజుల క్రితం రాజాసాబ్ గ్లింప్స్ లాంచ్ చేశారని తెలిసిందే. గ్లింప్స్‌లో ప్రభాస్ సూపర్ స్టైలిష్‌గా చేతిలో పూలబొకే పట్టుకొని అద్దంలో తనను తాను చూసుకుంటూ.. పూలు చల్లుతూ నయా లుక్‌లో కనిపిస్తూ అభిమానులకు విజువల్ ట్రీట్ ఇస్తున్నాడు. ఈ మూవీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. రాజాసాబ్‌లో సంజయ్ దత్ సంజూబాబా పాత్రలో కనిపించబోతున్నాడు.



## మారుతీ రావు దర్శకత్వంలో నయన్ సారిక

శ్రీవిష్ణు హీరోగా యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. జి. సుమంత్ నాయుడు నిర్మిస్తున్నారు. ఇందులో నయన్ సారిక కథానాయికగా కనిపించనుంది. ఈ విషయాన్ని ఆమె పుట్టినరోజు సందర్భంగా గురువారం ప్రకటిస్తూ ఓ వీడియోను పంచుకున్నారు. "ఒంగోలు నేపథ్యంలో సాగే వినోదాత్మక కథతో రూపొందుతున్న చిత్రమిది. శ్రీవిష్ణు పాత్ర చాలా వినోదభరితంగా ఉంటుంది" అని చిత్ర బృందం తెలిపింది. 'ఆయ్', 'క' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది నయన్.

## కవలలకు జన్మనివ్వనున్న రామ్‌చరణ్.. ఉపాసన



మెగా కుటుంబంలో సందడి రెట్టింపు కానుంది. రామ్‌చరణ్, ఉపాసన దంపతులు కవలలకు జన్మనివ్వనున్నారు. క్లీంకారకు తోడుగా ఇంకో ఇద్దరు చిన్నారులు రానున్నారన్నమాట. ఇటీవల చిరంజీవి నివాసంలో దీపావళి పండుగ సంబరాలతో పాటు, ఉపాసన శ్రీమంతం వేడుక జరిగింది. కుటుంబ సభ్యులు, పలువురు అతిథుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరిగాయి. అందుకు సంబంధించిన వీడియోను ఉపాసన ఇన్‌స్టాలో పంచుకున్నారు. 'ఈ దీపావళి మా ఇంట డబుల్ వేడుకల్ని తీసుకురావడంతోపాటు, ప్రేమని, ఆశీర్వాదాల్ని డబుల్ చేసింది' అంటూ ఆమె పేర్కొన్నారు. దాంతో రామ్‌చరణ్, ఉపాసన దంపతులకి అభినందనలు వెల్లువెత్తాయి. ఈసారి ఈ జంట కవల పిల్లలకు ఆహ్వానం పలికేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారని మెగా కుటుంబ సన్నిహితులు తెలిపారు. 2012లో వివాహం చేసుకున్న రామ్‌చరణ్, ఉపాసన జంట 2023లో క్లీంకారకు జన్మనిచ్చారు.

## బీచ్‌లో మడోన్నా సెబాస్టియన్ అందాల ఆరబోత



ప్రస్తుతం సోషల్ మీడియాలో ఓ వయ్యారి షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. పైన ఫోటోలో బీచ్ లో బ్లాక్ డ్రెస్ లో అందాల బీభత్సం సృష్టిస్తున్న హీరోయిన్ ఎవరో గుర్తుపట్టారా.. తెలుగు, తమిళం, మలయాళం భాషలలో వరుస సినిమాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. తక్కువ సమయంలోనే తనదైన ముద్ర వేసింది. ఆమె మరెవరో కాదండి. హీరోయిన్ మడొన్నా సెబాస్టియన్. నటనతోనే కాదు.. గ్లామర్ తో కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. తాజాగా బీజ్ ఒడ్డున సేద తీరుతూ అందుకు సంబంధించిన ఫోటోలను షేర్ చేసింది. బ్లాక్ కలర్ అవుట్ ఫిట్ లో అందాలు ఆరబోస్తూ సముద్రుడికే చెమటలు పట్టించేలా అందాలతో హీటెక్కించేసింది ఈ ముద్దుగుమ్మ. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ సోషల్ మీడియాలో తెగ వైరలయ్యాయి. దీంతో ఈ బ్యూటీ అందం రోజు రోజుకీ పెరుగుతుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అంతేకాదు.. ఈ బ్యూటీకి రోజు రోజుకీ ఫాలోవర్స్ సైతం పెరిగిపోతున్నారు. ప్రేమమ్ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఈ అమ్మడు మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్ సినిమాతో తెలుగు ప్రేక్షకులను ఫిదా చేసింది. ప్రస్తుతం తెలుగు, తమిళం, మలయాళం భాషలలో నటిస్తుంది. బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీ నుండి బ్యాచిలర్ ఆఫ్ కామర్స్ లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఆ తర్వాత సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. ప్రేమమ్ సినిమాతో తొలిసారిగా వెండితెరకు పరిచయమైన ఈ అమ్మడు.. ఆ తర్వాత వరుస అవకాశాలు అందుకుంది. ఎక్కువగా తమిళం, మలయాళం భాషలలో నటించింది. ప్రస్తుతం ప్రభాస్, సందీప్ రెడ్డి కాంబోలో రాబోతున్న స్పిరిట్ చిత్రంలోనూ కీలకపాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.

## రెడ్‌కలర్ డ్రెస్‌లో మెరిసిన శ్రీలీల



ఈ మధ్య అందాల ముద్దుగుమ్మ శ్రీలీల గ్లామర్ డోస్ పెంచుతూ, యూత్‌కు నిద్రలేకుండా చేస్తుంది. రోజు రోజుకు తన అంద చందాలతో అందరినీ మాయ చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ రెడ్ కలర్ ట్రెండీ వేర్‌లో తన అందంతో అందరినీ మాయ చేస్తుంది. పెళ్లి సందడి మూవీతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టిన చిన్నది శ్రీలీల. ఈ ముద్దుగుమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే. మొదటి సినిమా హిట్ అవ్వకపోయినా, ఈ అమ్మడు మాత్రం అందరి మనసు దోచేసుకుంది. తన డ్యాన్స్, నటన, అందంతో అందరినీ ఆకట్టుకుంది. పెళ్లి సంద%ు% తర్వాత ఈ ముద్దుగుమ్మకు వరసగా అవకాశాలు తలపు తట్టాయి. వచ్చిన ప్రతి ఛాన్స్ మిస్ చేసుకోకుండా, వరసగా సినిమాలు చేస్తూ తన అభిమానులను అలరిస్తుంది. ముఖ్యంగా ఈ బ్యూటీ దరవు సినిమాతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఈ మూవీ తర్వాత చాలా సినిమాలు చేసినప్పటికీ అవి డిజాస్టర్ అయ్యాయి. దీంతో ఈ చిన్నదానికి తెలుగులో ఆఫర్స్ కాస్త తగ్గాయి. తర్వాత మళ్లీ పుష్ప2 సినిమాలో కిసక్కి డ్యాన్స్‌తో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఈ సాంగ్‌లో ఈ అమ్మడు నటన, గ్లామర్‌కు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. దీని తర్వాత ఈ చిన్నదానికి వరసగా ఆఫర్స్ క్యూ కడుతున్నట్లు తెలుస్తోంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది, తాజాగా రెడ్ కలర్ ట్రెండీ వేర్‌లో తన అంద చందాలతో అందరినీ మాయ చేస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

## గ్రీన్ శారీలో మెహరీన్ మెరుపులు



టాలీవుడ్ యంగ్ బ్యూటీ మెహ్రీన్ ఫిర్జాదా గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ అమ్మడు టాలీవుడ్‌లో చాలా సినిమాలే చేసింది కానీ స్టార్ హీరోయిన్‌గా మాత్రం గుర్తింపు సంపాదించుకోలేకపోయింది. ప్రస్తుతం ఈ చిన్నది అడపాదడపా సినిమాలు చేస్తూ కెరీర్ కొనసాగిస్తుంది. ముఖ్యంగా ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు బాలీవుడ్ పై ఫోకస్ పెట్టి అక్కడ ఫుల్ బిజీ అయిపోతుంది. మెహ్రీన్ ఫిర్జాదా, 2016లో వచ్చిన కృష్ణగాడి వీర ప్రేమగాథ సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది, తన ఫస్ట్ సినిమాతోనే అందం, అభినయంతో అందరినీ ఆకట్టుకుంది. తన క్యూట్ క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో అందరినీ తనవైపు లాక్కుంది. ఆ తర్వాత ఫిల్లౌరీ అనే హిందీ సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది. ఇక ఈ సినిమా తర్వాత మెహ్రీన్‌కు వరసగా ఆఫర్స్ క్యూ కట్టాయి. దీంతో వరస సినిమాలతో ఫుల్ బిజీ అవుతుంది, స్టార్ హీరోయిన్‌గా సత్తా చాటుతుందని అందరూ అనుకున్నారు. కానీ ఎవరూ ఊహించని విధంగా ఈ ముద్దుగుమ్మ కెరీర్ డౌన్ ఫాలోఅయ్యింది. మొదటి సినిమా సూపర్ హిట్ అందుకుంది. తర్వాత చేసిన సినిమాల్లో చాలా వరకు ఫ్లాప్ అయ్యాయి. మహానుభావుడు, ఎఫ్2, ఎఫ్3 వంటివి మాత్రమే ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇక ఈ ముద్దుగుమ్మ నటించిన సినిమాలు ఫ్లాప్ కావడంతో ఈ ముద్దుగుమ్మకు కూడా ఆపర్స్ రావడమే కరవైపోయింది. దీంతో ఈ బ్యూటీ బాలీవుడ్ పై ఫోకస్ పెట్టి అక్కడ సినిమాలు చేయడానికి రెడీ అవుతున్నట్లు ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది, తాజాగా గ్రీన్ కలర్ శారీలో అందంగా ముస్తాబై, తన అంద చందాలతో అందరి మనసు దోచేస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

## కేథార్‌నాథ్ ఆలయాన్ని సందర్శించిన సారాఅలీఖాన్



బాలీవుడ్ నటి సారా అలీ ఖాన్ మరోసారి ఉత్తరాఖండ్‌లోని పవిత్ర కేదార్‌నాథ్ ఆలయాన్ని దర్శించుకున్నారు. తాజాగా దర్శనం చేసుకున్న తర్వాత, ఆ దేవాలయంతో తనకున్న బలమైన, లోతైన అనుబంధం గురించి ఆమె సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. నేను మొదటిసారిగా కెమెరా ముందు నిలబడింది ఈ పవిత్ర భూమిలోనే. నా మొదటి సినిమా జ్ఞాపకాలు, అపారమైన భక్తి ఈ ప్రదేశంతో ముడిపడి ఉన్నాయి. అందుకే ప్రతిసారీ ఇక్కడికి రావడం నాకు చాలా ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తుంది అని సారా తెలిపారు. సారా అలీ ఖాన్ తరచుగా కేదార్‌నాథ్‌ను సందర్శిస్తూ, ఆ అనుభూతులను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. హిందూ దేవాలయాలను సందర్శించడం, సంప్రదాయాలను గౌరవించడం పట్ల ఆమె చూపించే ఆసక్తిని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. సినిమాల విషయానికి వస్తే.. ఈ ఏడాది స్కై ఫోర్స్, మెట్రో ఇన్ డీనో సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సారా ప్రస్తుతం పతి పత్ని ఔర్ దో వో అనే చిత్రంలో నటిస్తుంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com